మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 27 శుక్రవారం సెప్టెంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 11
Navabhoomi daily fallows..




# మూసీ నిర్వాసితుల ఆందోళన

- ఆందోళనలకు దారి తీసిన మూసీ నిర్వాసితుల సర్వే
- పలు చోట్ల సర్వేకై వచ్చిన వారిని అడ్డుకున్న స్థానికులు
- అధికారులతో వాగ్వాదం
- పేదల కడుపు కొట్టొద్దని వేడుకున్న ప్రజలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో :** జీహెచ్ఎంసీ పరిధిలో మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితుల గుర్తింపు సర్వే ఆందోళనలకు దారి తీస్తోంది. పలు చోట్ల సర్వే కోసం వచ్చిన అధికారులను స్థానికులు అడ్డుకున్నారు.
వారితో వాగ్వాదానికి దిగారు. పేదల కడుపు కొట్టొద్దని వేడుకున్నారు. అయినా పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు ముందుకు సాగడంతో ఆందోళనలకు దారి తీసింది. ఈ సందర్భంగా బాధితులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా ఆక్రమణలను గుర్తించేందుకు అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటన కొనసాగించారు. ఇందులో భాగంగా గురువారం అధికారులు బృందాలుగా ఏర్పడి గోల్కొండ ఇబ్రహింబాగ్, లంగర్ హౌస్ డిఫెన్స్ కాలనీ, పాతబస్తీ, చాదర్ ఘాట్, శంకర్ నగర్, అంబర్ పేట్, ముసారాంబాగ్, కొత్తపేట, మారుతీనగర్, సత్యానగర్ , ఫణిగిరి కాలనీ, ఇందిరానగర్, గణేష్ పురి తదితర ప్రాంతాల్లో సర్వే కోసం చేరుకున్నారు.
అధికారుల రాక గురించి ముందుగానే సమాచారం అందడంతో బస్తీలలో మూసీ నిర్వాసితులు వందల సంఖ్యలో గుమికూడి సర్వేకు సహకరించకుండా అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. నిర్మాణాలకు అనుమతినిచ్చి ఇప్పుడు కూల్చివేస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు . సుమారు మూడు దశాబ్ధాలకు పైగా అమ్మకాలు, నిర్మాణాలు జరుగుతుంటే చేతులు ముడుచుకుని ఎందుకు కూర్చున్నారంటూ వాదనలకు దిగారు. ప్రభుత్వానికి అన్ని రకాల పన్నులు కడుతున్నామని వాపోయారు. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 16 అధికారుల బృందాలు సర్వే చేపడుతూ 1595 నిర్మాణాలను గుర్తించారు.

**నిరసనలు లెక్కచేయకుండా మార్కింగ్**

మూసీ బెడ్‌ను అనుసరించి నిర్వాసితులను గుర్తించేందుకు వచ్చిన అధికారుల బృందానికి స్థానికుల నుంచి నిరసనలు ఎదురౌతున్న పోలీసుల సహకారంతో కొన్ని చోట్ల మార్కింగ్ చేశారు. తహసీల్దార్ నేతృత్వంలో పర్యటిస్తున్న

# పాతబస్తీలో హైడ్రా!

- ఒవైసీ అడ్డాలో అడుగుపెట్టిన హైడ్రా!
- రంగనాథ్‌కు ఇదే అసలైన సవాల్!



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** హైదరాబాద్ లో హైడ్రా కూల్చివేతలు అత్యంత వేగంగా కొనసాగుతున్నాయి. వీలైనంత త్వరగా అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చి వేయాలి.. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లుగా అనిపిస్తుంది.
పెద్ద, పేద అని తేడా లేకుండా.. అది బఫర్ జోన్ కింద ఉందా లేదా ... కు వసు ... అనేది మాత్రమే దృష్టిలో ఉంచుకుని.. ఈ కూల్చివేతలు నిర్వహిస్తున్నారు. హైడ్రా బుల్డోజర్ల స్పీడ్ కు సామాన్యులు వణికిపోతున్నారు. ఎప్పుడు

- మిగతా 2లో

# భద్రతా మండలిలో భారత్ ఉండాల్సిందే

- ఐరాస భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వానికై భారత్ ప్రయత్నాలు
- అంతర్జాతీయంగా భారత్‌కు పెరుగుతున్న మద్దతు
- భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలని ఫ్రాన్స్ డిమాండ్



ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు అంతర్జాతీయంగా మరింత మద్దతు లభిస్తోంది. ఈ క్రమంలో ఫ్రాన్స్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది.
మారుతున్న కాలానికనుగుణంగా భద్రతా మండలి మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. భారత్ వంటి దేశాలకు కచ్చితంగా

# ఏపీలో మద్యం షాపులన్నీ రద్దు

## సర్కార్ కీలక ఆర్డినెన్స్ జారీ..!

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీలో మద్యం షాపులపై ప్రభుత్వం ఇవాళ కీలక నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం షాపుల ద్వారా భారీ ఎత్తున అవినీతి జరిగిందని అధికార కూటమి ఆరోపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ మేరకు మద్యం విధానంలో మార్పులు చేయబోతోంది.ఇందుకు సన్నాహకంగా గురువారం కీలక ఆర్డినెన్స్ జారీ చేసింది.దీంతో రాష్ట్రంలో ఉన్న మద్యం షాపులన్నీ రద్దు కాబోతున్నాయి. వీటి స్థానంలో ప్రైవేటుకు ఈ బాధ్యత అప్పగిస్తారు.

# జనసేనలో బాలినేని, సామినేని, కిలారి చేరిక



**అమరావతి-నవభూమిబ్యూరో:** వైసీపీ నేతలు బాలినేని, సామినేని, కిలారు రోశయ్య లు జనసేన పార్టీ చీఫ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో నేటి సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో పవన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..వారితో పాటు పారిశ్రామికవేత్త కంది రవి శంకర్ కూడా జనసేనలో చేరారు. అంతకు ముందు భారీ సంఖ్యలో కార్యకర్తలతో ఒంగోలు నుంచి ర్యాలీగా బయలదేరి మంగళగిరికి చేరుకున్నారు బాలినేని.. అయనతో ఆయన కుమారుడు కూడా నేడు పవన్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు..






నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in




## చెరువులో భారీ భవనం కూల్చివేత

**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో చెరువులు, నాలాలను అక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలపై రేవంత్ రెడ్డి సర్కార్ హైడ్రా పేరుతో ఉక్కు పాదం మోపుతుంది. అందులోభాగంగా హైదరాబాద్‌తోపాటు నగర శివారులోని పలు భవనాలను ఇప్పటికే హైడ్రా నేలమట్టం చేసింది. అలాంటి వేళ సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కుతుబ్‌శాయి పేట గ్రామంలో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. స్థానిక చెరువులో నాలుగంతస్తుల భవన నిర్మాణంపై చర్యలు చేపట్టారు. అందులోభాగంగా బాంబులతో ఆ భవనాన్ని నేలకూల్చారు. ఆ క్రమంలో బాంబులు పేలి.. భవనం తాలుక శిథిలాలు ఎగిరిపడ్డాయి. హైదరాబాద్ నగరానికి చెందిన ఓ వ్యక్తి పుష్కర కాలం క్రితం మల్కాపురం పెద్ద చెరువు పరిధిలో ఈ భవనం నిర్మించారని స్థానికులు వెల్లడించారు. నీళ్లో అడుగు పెట్టుకుండా.. భవనంలోకి వెళ్లేందుకు ఓ మార్గాన్ని సైతం నిర్మించారని వారు పేర్కొన్నారు. సెలవు రోజుల్లో వారు.. హైదరాబాద్ నగరం నుంచి ఇక్కడి వచ్చి సేద తీరుతారని గ్రామస్తులు వివరించారు.



## అక్రిడేషన్ కార్డుల గడువు మరో 3 నెలలు పొడిగింపు



**హైదరాబాద్- నవభూమి:** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ (గుర్తింపు కార్డు) గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీతో అక్రిడేషన్ కార్డుల గడువు ముగియనుంది. తదితర కారణాల వల్ల ఈ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఐ అండ్ పీఆర్ అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు అక్రిడేషన్ల గడువును పొడిగిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు అధికారులు తెలియజేశారు.

## శిక్ష తప్పదు.. రిటైర్ అయినా రికవరీ చేయిస్తా..


### అధికారులను హెచ్చరించిన కేటీఆర్



**రాజన్న సిరిసిల్ల -నవభూమి:** కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మాదిరి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న అధికారులపై సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నిప్పులు చెరిగారు. ఇప్పుడు అహంకారంతో అడ్డగోలుగా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులకు శిక్ష తప్పదు.. రిటైర్ అయినా రికవరీ చేయించే బాధ్యత తానే తీసుకుంటానని కేటీఆర్ హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.
అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా, కార్యకర్తల మాదిరి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్న చిన్న పల్లెలను గ్రామపంచాయతీలుగా మార్చి 54 కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేశాం. ఆ రేషన్ దుకాణాలను స్థానికంగా ఉండే పొదుపు సంఘాలకు అప్పజెప్పాం. తద్వారా వారికి కొంత ఆదాయం వస్తదని అప్పజెప్పాం. మరి నువ్వేం చేశావు. ఇక్కడున్న కాంగ్రెస్ నాయకుడు తానే రాజు, తానే మంత్రి అన్నట్టు.. నేనే ప్రభుత్వాన్ని నడుపుతున్న అన్నట్టు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు అధికారులు వంతపాడుతూ ఆగమాగం అవుతున్నారు. మొన్న ఏపీలో ఏం జరిగిందో చూడండి.. ఆలిండియా సర్వీస్ ఆఫీసర్లు కూడా సస్పెండ్ అయ్యారు. చట్టం ప్రకారం కాకుండా ఇష్టమొచ్చినట్టు చేస్తాం అంటే తప్పకుండా ఫలితం అనుభవిస్తారు. ఆలిండియా సర్వీసు ఆఫీసర్లు, పోలీసులు, ఆర్డీవోలు, కలెక్టర్లు ఎవరైనా ఫలితం అనుభవిస్తారు. చట్టం ప్రకారం, ఒళ్లు దగ్గర పెట్టుకోని పని చేయండి. ఇష్టమొచ్చినట్లు చేస్తామంటే ఊరుకోం. మరో నాలుగేండ్లలో మళ్లీ కేసీఆర్ తిరిగి వస్తరు.. మీ సంగతి తప్పకుండా చూస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. కలెక్టర్, ఆర్డీవోను అడుగుతున్నా.. 54 రేషన్ దుకాణాలకు 480 మంది దరఖాస్తు చేసుకున్నారు. పారదర్శకత పాటించకుండా లక్షల రూపాయాలకు ఆ పోస్టులను అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులే ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపిస్తున్నారు. అర్హత ఉన్న బాధితులేమో వాటర్ ట్యాంక్‌లు ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌ను, స్థానిక మంత్రులను ఈ విషయంలో సూటిగా అడుగుతున్నా.. రాతపరీక్ష పెట్టామని అంటున్నారు కదా.. మెరిట్ లిస్ట్ బయటపెట్టండి.. వెంటనే జాబితా ప్రకటించండి. పీజీలు, డిగ్రీలు చదువుకున్నోళ్లకు మార్కులు రావట. పదో తరగతి పాసైన వారికి మార్కులు వస్తాయట.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటే, లక్షలు సమర్పించుకుంటే మార్కులు వస్తాయట. ఇంత దిక్కుమాలిన రాజకీయాలు చేస్తారా..? లక్షల రూపాయాలకు పోస్టులను అమ్ముకుంటారా..? మళ్లీ మా టైం వస్తది.. తప్పకుండా అధికారులకు శిక్ష పడుతది. రిటైర్ అయినా రికవరీ చేయిస్తాం.. అతి చేసే వారికి మిత్తితో సహా చెల్లిస్తాం. రేషన్ దుకాణాల బాధితుల తరపున హైకోర్టును ఆశ్రయిస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## తెలంగాణలో మరో రెండురోజులు కొనసాగనున్న వానలు..

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో మరో



రెండురోజులు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరించింది. శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# డీజేలతో ఇబ్బందులు.. త్వరలోనే ఆంక్షలు..



**హైదరాబాద్-నవభూమి:** డీజేల నియంత్రణపై హైదరాబాద్ పోలీసులు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వినియోగంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు..

ఏవైనా పండుగలు.. ఉత్సవాలు.. ర్యాలీలు అంటే వెంటనే గుర్తొచ్చేది డీజే.. ప్రస్తుతం డీజే ఓ ట్రెండ్‌గా మారింది. డీజే లేకపోతే ఫుల్ బోర్.. ఓ వైపు డీజే పేరుతో పెద్ద పెద్ద సౌండ్స్ పెట్టి డ్యాన్స్ చేయడం దాదాపు అన్ని ర్యాలీల్లో చూస్తున్నాం. ఈ డీజే సౌండ్స్‌పై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. పెద్ద పెద్ద సౌండ్స్‌తో ఇబ్బందులు పడుతున్నట్లు నగర వాసులు పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో డీజేల నియంత్రణపై హైదరాబాద్ పోలీసులు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన మతపరమైన ర్యాలీల్లో డీజే, టపాసుల వినియోగంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, మత సంఘాల ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ అధికారులతో పాటు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలీ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, మత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**డీజే శబ్దాలపై ఫిర్యాదులు..**

డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ సౌండ్స్‌తో నివాసాల్లో వయసు మీరిన వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొందరు గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారని, డీజే సౌండ్స్ శృతి మించుతున్నాయన్నారు. కేవలం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగానే కాకుండా మిలాద్ ఉన్ నబి వేడుకల్లోనూ డీజే నృత్యాలు విపరీతమయ్యాయని చెప్పారు. పండుగలు, ఉత్సవాలు లేదా ఏదైనా ర్యాలీల్లో డీజేలు ఎక్కువగా వాడుతున్నారని తెలిపారు. పబ్‌లో డ్యాన్సులు చేసినట్లే ర్యాలీల్లో చేస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. డీజే శబ్దాలను కట్టడి చేయాలని వివిధ సంఘాల నుంచి వినతులు వచ్చాయని తెలిపారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ మత సంఘాల ప్రతినిధులను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. అందరి అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం డీజేలపై ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు. డీజే శబ్దాలపై నియంత్రణ లేకపోతే ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు.

## జర్నలిస్ట్ మృతిపై తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం



**హైదరాబాద్-నవభూమి:** సీనియర్ జర్నలిస్ట్ టి ఆదినారాయణ ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందారు. గురువారం ఉదయం అపార్ట్ మెంట్‌పై వాకింగ్ చేస్తుండగా జారిపడ్డారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలోకి తీసుకెళ్లేలోపు చనిపోయారు. గత 25 ఏళ్ల నుంచి నారాయణ ఈటీవీలో పనిచేస్తున్నారు. నారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**సీఎం రేవంత్ సంతాపం**


నారాయణ మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. నారాయణ అకాల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదినారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు. నారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## హర్షసాయి కేసులో మరో ట్విస్ట్.. మరో ఫిర్యాదు అందుకున్న పోలీసులు



**హైదరాబాద్- నవభూమి:** యువతిని నమ్మించి మోసం చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ యూట్యూబర్( హర్ష సాయి కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న హర్షసాయిపై బాధితురాలు గురువారం మరో ఫిర్యాదు చేశారు.
హర్ష తనకు కొన్ని గంటలుగా ఈ మెయిళ్లు పంపిస్తూ వేధిస్తున్నాడని హైదరాబాద్ నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. ఇప్పటికే తనపై పలు మార్లు అత్యాచారం చేశాడని, రూ.2 కోట్ల డబ్బులు కూడా తీసుకున్నాడని హర్షపై ఇదే పోలీస్ స్టేషన్లో ఆమె కేసు పెట్టిన సంగతి తెలిసిందే.

## ఉపఎన్నికపై కడియం శ్రీహరి సంచలన కామెంట్స్



**జనగామ-నవభూమి:** స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. స్టేషన్‌ఘనపూర్‌కు ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని అన్నారు. ఏకంగా శాసనసభ పక్షాలను కలుపుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని వ్యాఖ్యలు చేశారు.
ఇప్పట్లో ఉప ఎన్నిక రావని... వచ్చినా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్‌లో ఎన్నికలు వస్తే... బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. కోర్టులపై, ప్రజాస్వామ్యంపై తమకు గౌరవం ఉందన్నారు. వరంగల్ చరిత్రను కనుమరుగు చేసేందుకే ఉమ్మడి జిల్లాను కేసీఆర్ ఆరు ముక్కలు చేశారని.. ఇది అడిగినందుకే తనకు రెండోసారి మంత్రి పదవి ఇవ్వలేదని తెలిపారు. కేసీఆర్ కుటుంబం చేతిలో తెలంగాణ బంధి అయిందని కడియం శ్రీహరి విమర్శలు గుప్పించారు.
కాగా... రాష్ట్రంలో ఉపఎన్నికలు రాబోతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదేపదే చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కీలక అసెంబ్లీ స్థానం స్టేషన్‌ఘనపూర్‌కు త్వరలో ఉపఎన్నిక వస్తుందని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ ఎన్నికల్లో తాటికొండ రాజయ్య విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించింది. బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి పోటీచేసి విజయం సాధించారు. కానీ 2024 పార్లమెంట్ ఎన్నికల సమయానికి కడియం పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. కడియం శ్రీహరికి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కడియంతో పాటు పలువురు బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

## వచ్చే ఏడాది నుంచి ప్రతి క్లాసుకు ఒక టీచర్ విధానం: లోకేశ్

**శ్రీకాకుళం-నవభూమి:** వచ్చే ఏడాది నుంచి ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి క్లాసుకు ఒక టీచర్ విధానాన్ని అమలు చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. శ్రీకాకుళం ఎచ్చెర్ల వీధిలోని మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూలులో మంత్రి నారా లోకేశ్ నేడు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల తరగతి గదులను మంత్రి పరిశీలించారు. పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల చదువు కొనసాగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు.
మీకు ఇష్టమన సబ్జెక్ట్ ఏమిటని ప్రశ్నించినపుడు ఇంగ్లీష్, ఈవీఎస్ సబ్జెక్టులని విద్యార్థులు చెప్పారు. స్కూలులో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది? అమ్మా, నాన్న ఏం చేస్తున్నారు? యూనిఫాం, బ్యాగ్స్ బాగున్నాయా? తదితర ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.
విద్యార్థుల వర్క్ బుక్‌ను పరిశీలించిన మంత్రి చిన్నారుల హ్యాండ్ రైటింగ్ బాగుందని కితాబిచ్చారు.

# పాతబస్తీలో హైడ్రా!

(1వపేజీ తరువాయి)ఏ వైపు నుంచి ఏ బుల్డోజర్ వస్తుందా.. ఏ వైపు నుంచి ఏ నోటీ సులు వస్తాయా అని.. సామాన్యుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఓ వైపు సామాన్యులు కన్నీరు మున్నీరు అవుతూ మీడియాకు తమ గోడును విన్నవించుకుంటున్నారు. అయినా సరే.. మరో వైపు హైడ్రా తన పని తానూ చేసుకుంటూ పోతుంది. అక్రమ ఆక్రమణ అని తెలిసిన వెంటనే ఆ భవనాన్ని క్షణాల్లో నేలమట్టం చేస్తుంది. ఈ క్రమంలో ప్రస్తుతం హైదరాబాద్ లోని పాత బస్తీ ప్రాంతంలో ఈ సర్వేని కొనసాగిస్తున్నారు.
హైదరాబాద్ పాత బస్తి ఏరియాలో అధికారు లు సర్వే కొనసాగిస్తున్నారు. అత్తాపూర్ లో ఇంటి ఇంటికి కూడా అధికారులు మార్కింగ్ చేస్తున్నారు. అది చాలా సెన్సిటివ్ ఏరియా కావడంతో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు కూడా మోహరించారు. అక్కడ ఎలాంటి ఉద్రిక్తత ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లుగా సమాచారం. ఎన్నో ఏళ్ళ నుంచి ప్రజలు అక్కడ నివాసం ఉంటున్నారు. దీనితో అక్కడి వారంతా కూడా దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మీడియాతో తమ గోడును చెప్పుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజేంద్ర నగర్ ఆర్డీవో వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈ సర్వే జరుగుతుంది. ఇంటి ఇంటికి తిరుగుతూ.. ప్రతి చిన్న డీటెయిల్ ను కూడా అధికారులు క్షుణ్ణంగా సేకరిస్తున్నారు. మరి అక్కడ ఏ క్షణంలో ఎలాంటి ఉద్రిక్తత వాతావరణం నెలకుంటుందో చెప్పలేని పరిస్థితి. ఇప్పటివరకు ఎక్కడ అక్రమ నిర్మాణాలు కనిపిస్తే అక్కడ క్షణాల్లో నేలమట్టం చేసిన హైడ్రా.. ఇక్కడ ఏం చేస్తుందో చూడాలి. రంగనాథ్ కు ఇది అసలైన సవాల్ అని చెప్పి తీరాలి. ఇప్పటికే హై స్పీడ్ లో దూసుకుపోతున్న హైడ్రాకు మరింత స్పీడ్ పెంచేలా.. రేవంత్ సర్కార్ అదనంగా 169 మంది సిబ్బందిని రంగంలోకి దించింది. దీనిని బట్టి చూస్తుంటే.. నగరంలో బఫర్ జోన్ కిందకు వచ్చే ఒక్క భవనాన్ని కూడా హైడ్రా వదిలిపెట్టేలా కనిపించడం లేదు. ఇక రానున్న రోజుల్లో ఈ హైడ్రా బుల్డోజర్లు ఏ ఏ ప్రాంతాలపై ఫోకస్ చేస్తాయా అని.. ప్రజలంతా టెన్షన్ లో ఉన్నారు. ప్రస్తుతం పాతబస్తీలో మాత్రం పెద్ద ఎత్తున అక్కడి ప్రజలు దీనిని వ్యతిరేకిస్తు న్నారు. మరి వారికి ప్రభుత్వం ఎలాంటి వెసులుబాటును కలిగిస్తుందో చూడాలి. ఈ శని ఆది వారాల్లో మూసి పరివాహక ప్రాంతంలోని అక్రమ నిర్మాణాలన్నింటిని కూల్చివేసే ప్లాన్ లో ఉన్నట్లు సమాచారం.

## మూసీ నిర్వాసితుల ఆందోళన

(1వపేజీ తరువాయి)అధికారులు మూసీని అనుసరించి ఉన్న వారి వివరాలు సేకరించేందుకు ప్రయత్నం చేశారు. పేదలు ఎవరికీ ప్రభుత్వం నష్టం చేయదని నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. మీరు ఒప్పుకుంటే మీకు ఇప్పుడే ఎక్కడ డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించామో చెబుతామని, అవసరం అయితే ఖాళీ చేసి అక్కడికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పిస్తామని కూడా అధికారుల బృందం సర్ది చెప్పారు. అయినా వారు వినకుండా మొండికేశారు. కొంతమంది ముందుకు వచ్చి వివరాలు చెప్పడంతో నమోదు చేసుకున్నారు. తొలగింపు ఎక్కడి నుంచి ఎక్కడి వరకనేది తెలిసేలా మార్కింగ్ చేశారు.

**బఫర్ జోన్ జోలికి వెళ్లని అధికారులు**

మూసీ బ్యూటిఫికేషన్ లో భాగంగా నిర్వాసితులను రెండు రకాలుగా గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీరిలో మూసీని అనుసరించి నివాసముంటున్న వారు, బఫర్ జోన్ నివాసితులుగా గుర్తించారు. ముందుగా మూసీ బెడ్ వెంట ఉన్నవారిని అక్కడి నుంచి తరలించి డబుల్ బెడ్ రూంలు కేటాయిస్తోంది. మూసీ పరివాహక ప్రాంతం నుండి 50 మీటర్ల పరిధిని బఫర్ జోన్ గా ప్రభుత్వం ప్రకటించింది. దీని పరిధిలో పెద్ద అపార్ట్ మెంట్ లు, బహుళ అంతస్తుల భవనాలు ఉండటంతో అధికారులు వాటిల్లో ఉంటున్న వారికి ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం గమనార్హం. అయితే చాలా చోట్ల కూల్చివేతలను సూచించే మార్కింగ్ చేశారు. దీంతో బఫర్ జోన్ లో నివాసముంటున్న వారు కూడా కార్యాచరణ రూపొందించి అడ్డుకునేందుకు చూస్తున్నారు.

**పోలీసులు లేకుండా ముందుకు కదలలేని పరిస్థితి**

మూసీ నిర్వాసితులను గుర్తించేందుకు పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులకు అడుగడుగునా స్థానికుల నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది . ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి అధికారులతో గొడవకు దిగుతుండటంతో పోలీసుల సహాయం లేకుండా వారు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా వారికి సంఘీభావం చెప్పేందుకు కూడా రాని ప్రజాప్రతినిధులను శాపనార్థాలు పెట్టారు. ఈ సారి ఓట్లు అడిగేందుకు ఏ ముఖం పెట్టుకుని వస్తారో చూస్తామంటూ వారిపై దుమ్మెత్తి పోయడం తో సర్వే సగంలోనే అధికారులు వెనుదిరిగారు.

## భద్రతా మండలిలో భారత్ ఉండాల్సిందే

(1వపేజీ తరువాయి)స్థానం కల్పించాలని సూచించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభాలను పరిష్కరించడం ఐరాసకు తీవ్ర సవాలుగా మారిందని వార్తలు వినిపిస్తున్న వేళ ఫ్రాన్స్ ఈ విధంగా వ్యాఖ్యానించింది.
"భద్రతా మండలి విస్తరణకు ఫ్రాన్స్ అనుకూలం. భారత్, జర్మనీ, జపాన్, బ్రెజిల్‌లకూ శాశ్వత సభ్యత్వం ఉండాలి. ఆఫ్రికా నుంచి రెండు దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి" అని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ పేర్కొన్నారు. ఐరాస సర్వసభ్య సమావేశాల్లో ప్రసంగించిన ఆయన.. యూఎన్ఎస్సీ సమర్థతను పునరుద్ధరించడానికి కేవలం ఈ మార్పులు సరిపోవన్నారు.
యూఎన్ఎస్సీ అవలంబిస్తున్న విధానాల్లో మార్పులు రావాల్సి ఉందని ఫ్రాన్ అధ్యక్షుడు అభిప్రాయపడ్డారు. సామూహిక నేరాల కేసుల్లో వీటో అధికారాలకు పరిమితులు, శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన వ్యూహాలపై దృష్టి పెట్టడం వంటి మార్పులు రావాలన్నారు. క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టేందుకు సమయం ఆసన్నమైందని మెక్రాన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్న విషయం తెలిసిందే.

## జగన్ కు 20 కేజీల లడ్డూ బహూకరణ

**తాడేపల్లి-నవభూమి:** వైసీపీ అధినేత జగన్‌కు ఓ విశిష్ట కానుక అందింది. విశాఖపట్నం గాజువాక గణేశ్ ఉత్సవ కమిటీ జగన్ కు 20 కేజీల లడ్డూను బహూకరించింది. ఇవాళ తాడేపల్లి వచ్చిన గాజువాక గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు జగన్‌కు వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఈ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాజువాకలో 89 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాగా, ఇవాళ జగన్ ను కలిసి భారీ లడ్డూ అందించిన వారిలో వైసీపీ కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, విద్యార్థి విభాగం నేత జిలకర్ర నాగేంద్ర, గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ కోసిరెడ్డి గణేశ్ ఉన్నారు.

# దేశ ఆర్థికాభివృద్ధిలో 5 రాష్ట్రాలే కీలకం

అత్యంత ధనిక, పేద రాష్ట్రాలు ఇవే..

**హైదరాబాద్- నవభూమి:** భారత దేశం ప్రపంచంలో ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. రాబోయే ఐదేళ్లలో మూడో స్థానానికి చేరుకుంటామని అంటున్నారు ప్రధాని మోదీ. ఈమేరకు ఆయన చర్యలు కూడా చేపడుతున్నారు.
అయితే దేశ ఆర్థికాభివృద్ధిలో దేశంలోని పలు రాష్ట్రాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. దేశ తలసరి ఆదాయాన్ని మించి ఆ రాష్ట్రాల తలసరి ఆదాయం ఉంది. దీంతో దేశ జీడీపీ వృద్ధిలో కూడా ఆ రాష్ట్రాలే కీలకంగా మారాయి. గతంలో దేశ ఆర్థికాభివృద్ధిలో మహారాష్ట్ర కీలకంగా ఉండేది. కానీ ఇటీవల ఆ దేశ తలసరి ఆదాయం క్రమంగా తగ్గుతోంది. దీంతో దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. దేశ జీడీపీలో 30 శాతం వాటా ఈ రాష్ట్రాలే కలిగి ఉన్నాయి. 1991 నాటి జాతీయ సగటుకన్నా ఎక్కువ. ఇక మహారాష్ట్ర వాటా 15 శాతం నుంచి 13.3 శాతానికి తగ్గింది.

**అత్యంత సంపన్న రాష్ట్రాలు..**

తలసరి ఆదాయంలో తెలంగాణ, ఢిల్లీ, హర్యాన దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. అత్యంత సంపన్న రాష్ట్రాలుగా నిలిచాయి. బిహార్, ఉత్తర ప్రదేశ్ అత్యల్ప జీడీపీతో చివరిస్థానంలో ఉన్నాయి. దీంతో దక్షిణాది రాష్ట్రాలే దేశ జీడీపీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇక ప్రాంతీయ అసమానతలు పశ్చిమ బెంగాల్ వంటి పేద రాష్ట్రాల్లో కొనసాగుతున్నాయి. కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు దక్షిణాదిలో గణనీయమైన ఆర్థిక పురోగమనాన్ని సాధించాయి.

**తలసరి ఆదాయం ప్రకారం ధనిక రాష్ట్రాలు**

2021, సెప్టెంబర్ 18న విడుదల చేసిన ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక ప్రకారం.. జాతీయ సగటులో తలసరి ఆదాయం ఆధారంగా అత్యంత ధనిక రాష్ట్రాలుగా ఐదు రాష్ట్రాలు గుర్తింపు పొందాయి. 2014లో ఏర్పడిన తెలంగాణ అతి తక్కువ కాలంలోనే ధనిక రాష్ట్రాల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. ఢిల్లీ, హర్యానా రెండు, మూడో స్థానంలో ఉన్నాయి. మహారాష్ట్ర, భారతదేశ జీడీపీలో కీలక కంట్రిబ్యూటర్‌గా మిగిలిపోయినప్పటికీ, తలసరి ఆదాయంలో మొదటి ఐదు స్థానాల్లో స్థానం పొందలేదు.

తెలంగాణ: 176.8%
ఢిల్లీ: 167.5%
హర్యానా: 176.8%
మహారాష్ట్ర: 150.7%
ఉత్తరాఖండ్: 145.5%


**తలసరి ఆదాయం ప్రకారం పేద రాష్ట్రాలు**

తలసరి ఆదాయం ప్రకారం భారతదేశంలో ఉత్తరప్రదేశ్, బీహార్ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలుగా ఉన్నప్పటికీ, జాతీయ సగటులో వరుసగా 43.8% మరియు 39.2% వద్ద అత్యల్ప తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి.

బీహార్: 39.2%
ఉత్తరప్రదేశ్: 43.8%
మధ్యప్రదేశ్: 46.1%
రాజస్థాన్: 51.6%
ఛత్తీస్‌గఢ్: 52.3%

**దేశ జీడీపీకి సహకారం**

ఐదు దక్షిణాది రాష్ట్రాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ తమిళనాడులు మార్చి 2024 నాటికి భారతదేశ జీడీపీలో 30% వాటాను కలిగి ఉన్నాయి, ఇది 1991లో జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. పశ్చిమ బెంగాల్, ఒకప్పుడు 1960-61లో జీడీపీలో 10.5% వాటాను కలిగి ఉంది, ప్రస్తుతం స్థిరమైన క్షీణత కేవలం 5.6%కి చేరుకుంది. దాని తలసరి ఆదాయం కూడా జాతీయ సగటులో 127.5% నుంచి 83.7%కి పడిపోయింది, ఇది రాజస్థాన్, ఒడిశా వంటి రాష్ట్రాల కంటే తక్కువ. ఉత్తరప్రదేశ్ వాటా 1960-61లో 14% నుంచి 9.5%కి పడిపోయింది.



## 'సీఎం పదవి నుంచి తప్పుకోండి'.. సిద్ధరామయ్యకు సొంత పార్టీ నేతల సలహా

**బెంగళూరు: నవభూమి:**కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చాలా ఇరకాటంలో పడ్డారు. స్కామ్ ఆరోపణల నేపథ్యంలో సీఎం పదవికి ఆయన రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు సీఎం పదవి నుంచి సిద్ధరామయ్య తప్పుకోవాలని సొంత పార్టీ నేతలు కూడా సూచిస్తున్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణానికి సంబంధించి సిద్ధరామయ్యపై కేసు నమోదు చేయాలని ట్రయల్ కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీఎం పదవి



నుంచి ఆయన తప్పుకోవాలని కాంగ్రెస్ నేతలు గళమెత్తుతున్నారు. కాగా, రాష్ట్రంలోని అధికార పార్టీకి మరింత ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్య తప్పుకోవాలని ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మాజీ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన 79 ఏళ్ల కేబీ కోలివాడ్ సూచించారు. 'ఈ మచ్చ తొలగిపోయిన తర్వాత ఆయన మళ్లీ సీఎం కావచ్చు. ఇది నా వ్యక్తిగత అభ్యర్థన' అని మీడియాతో అన్నారు. ఈ పరిస్థితిని ప్రతిపక్ష పార్టీలు ఉపయోగించుకుంటున్నాయని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీకి అధ్యక్షుడైన కేబీ కోలివాడ్ విమర్శించారు. ప్రధాని మోదీ కూడా హర్యానాలో దీని గురించి మాట్లాడటాన్ని ఆయన గుర్తు చేశారు.

## తిరుమల మెట్లు ఎక్కేముందే వైఎస్ జగన్ డిక్లరేషన్ ఇవ్వాలి: బీజేపీ ఎంపీ పురందేశ్వరి



**విజయవాడ –నవభూమి:** ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్.. శనివారం తిరుమల శ్రీవారి దర్శనం కోసం వెళ్తున్నారు. ఆయన కాలినడకన ద్వారా తిరుమలకు వెళ్లే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఓ డిమాండ్ చేసింది. వెంకటేశ్వరుడి దర్శనం కోసం వెళ్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్.. ఆయన ఏ మతస్థుడో డిక్లరేషన్ ఇవ్వాలని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. ఒకవేళ అన్యమతస్థుడైతే, అప్పుడు వాళ్లు తాము ఏ మతాన్ని నమ్ముతున్నారో డిక్లరేషన్‌లో పేర్కొనాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. వైఎస్ జగన్ తన మతం ఏంటో చెప్పిన తర్వాతే ఆయన దర్శనానికి వెళ్లాలని, తిరుమల మెట్లు ఎక్కడానికి ముందే ఆ డిక్లరేషన్ ఇవ్వాలని పురందేశ్వరి డిమాండ్ చేశారు.

## బెంగళూరులో రైలుకూ తప్పని ట్రాఫిక్ కష్టాలు..!



**బెంగుళూరు–నవభూమి:** కర్ణాటక రాజధాని బెంగళూ రు మహానగరం ట్రాఫిక్‌కు పేరుగాంచింది. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే మొదటి స్థానం. ఇక్కడ తక్కువ దూరం ప్రయాణించడానికి గంటల సమయం పడుతుంది. దీంతో ప్రజలు తమ ట్రాఫిక్ కష్టాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు. ఇక నగర రోడ్లపై నడిచే వాహనాలకే కాదు.. పట్టాలపై పరుగు పెట్టే చుక్ చుక్ రైళ్లకూ నగరంలో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ఇప్పటి వరకూ ట్రాఫిక్‌లో బస్సులు, కార్లు, బైకులు తదితర వాహనాలు మాత్రమే చిక్కుకుంటుండటం చూశాం. ఇప్పుడు ఆ జాబితాలో రైలు సైతం వచ్చి చేరింది. నగరంలో ఓ రైల్వే క్రాసింగ్ గేట్ వద్ద పలు వాహనాలు ముందు సాగుతున్నాయి. అందుకు కొద్ది దూరంలో ఓ రైలు పట్టాలపై ఆగి ఉంది. ఇందుకు సంబంధించిన వీడియోను ఓ నెటిజన్ ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. 'నువ్వు, నేను కాదు.. బెంగళూరు ట్రాఫిక్ నుంచి ఈ రైలు కూడా తప్పించుకోలేకపోయింది' అంటూ సరదాగా చమత్కరించారు. ఈ వార్త కాస్తా వైరల్ కావడంతో.. ఆగ్నేయ రైల్వే స్పందించింది. కేరళ వెళ్తున్న ఈ రైలులో సాంకేతిక లోపం తలెత్తిందని.. మున్నెకోళ్ల రైల్వే క్రాసింగ్ వద్ద రైలును నిలిపి లోకో పైలెట్ తనిఖీలు చేపట్టారని వివరణ ఇచ్చింది. అంతేకానీ ట్రాఫిక్ సమస్య కాదని ఆగ్నేయ రైల్వే స్పష్టం చేసింది. మంగళవారం ఈ ఘటన చోటు చేసుకున్నట్లు వెల్లడించింది.

## పార్క్ చేసిన కారులో.. శవమై కనిపించిన ఐదుగురు కుటుంబ సభ్యులు

**న్యూఢిల్లీ–నవభూమి:** ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు పార్క్ చేసిన కారులో శవమై కనిపించారు. రెండు రోజులుగా రోడ్డు పక్కగా కారు నిలిచి ఉండటాన్ని స్థానికులు గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ఐదుగురు కుటుంబ సభ్యులు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. తమిళనాడులోని పుదుక్కొట్టై జిల్లాలో ఈ సంఘటన జరిగింది. పుదుకొట్టై–మధురై హైవేలోని నామనసముద్రంలో సెప్టెంబర్ 24 నుంచి ఒక కారు నిలిచి ఉంది. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు ఆ కారు పట్ల అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకున్నారు. కారును పరిశీలించగా ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు సీట్లలో మరణించి ఉన్నారు.

కాగా, సేలంలో నివసించే 50 వేళ్ల వ్యాపారవేత్త మణికందన్, భార్య నిత్య, తల్లి సరోజ, పిల్లలైన 17 ఏళ్ల కుమారుడు, 15 ఏళ్ల కుమార్తెగా మృతులను గుర్తించారు. వారు విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక సూసైడ్ నోట్‌ను కూడా ఆ కారులో గుర్తించారు. మరోవైపు మెటల్ వ్యాపారం చేసే మణికందన్ అప్పుల్లో కూరుకుపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిడి నేపథ్యంలో ఆ కుటుంబం కారులో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రాణం తీసిన హెయిర్ ట్రాన్స్ ప్లాంట్..

# అసలేం జరిగింది?



**న్యూఢిల్లీ– నవభూమి:**ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా జుట్టు ఊడిపోవడం అత్యంత సహజమైన విషయంగా మారిన సంగతి తెలిసిందే. జీన్స్ వల్ల కొందరికి ఊడితే.. కాలుష్యం, ఒత్తిడి వల్ల మరికొంతమందికి జుట్టు ఊడిపోతుంది. ఇందులో పెళ్లి కాని యువకుల జాబితా కూడా ఎక్కువగానే ఉందని అంటున్నారు. ఒకప్పుడు ఇలా జుట్టు ఊడినవాళ్లు విగ్గులు పెట్టుకునేవారు.. అయితే ఇప్పుడు హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ చేయించుకుంటున్నారు. తమ అందాన్ని తిరిగి తెచ్చుకుంటున్నారు! అయితే తాజాగా ఈ ప్రయత్నమే చేసిన ఓ యువకుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఇది మరోసారి కాస్మొటిక్ సర్జరీలు విఫలమైతే జరిగే పరిణామాలపై చర్చకు తెరలేపింది. అణుబాంబు దాడికీ వెనుకాడను.. పుతిన్ అవును... మంగుళూరులో కాస్మొటిక్ సర్జరీ సమయంలో ఓ విషాద ఘటన జరిగింది. ఇల్లాల్ లోని అక్కరెకెరె నివాసి మహమ్మద్ మజిన్.. బెండోర్ వెల్ లోని ఫ్లాంట్ కాస్మొటిక్ సర్జరీ, హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ క్లీనిక్ లో గైనెకోమాస్టియా కోసం శస్త్రచికిత్స చేయించుకుంటున్నాడు. ఈ సమయంలో అతడి ఆరోగ్యం విషమించిందని చెబుతున్నారు. వాస్తవానికి అరగంట మాత్రమే ఈ చికిత్స ఉంటుందని.. అయితే సాయంత్రం వరకూ అతడు రాకపోవడంతో తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేశారని అంటున్నారు. ఈ సమయంలో తమ కుమారుడి పరిస్థితి గురించి ఆస్పత్రిలో ఆరా తీయగా.. అతడి ఆరోగ్యం విషమించిందని సమాచారం అందిందట. అప్పటికే అతడిని ఆ క్లీనిక్ వారు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని అంటున్నారు. దీంతో... శస్త్రచికిత్స సమయంలో వైద్యుల నిర్లక్ష్యమే మహమ్మద్ అకాల మరణానికి కారణమైందని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై దక్షిణ కన్నడ జిల్లా ఆరోగ్య శాఖ అత్యంత సీరియస్‌గా వ్యవహరిస్తోందని అంటున్నారు. శస్త్రచికిత్స సమయంలో మాజిన్ అనూహ్య క్షీణత గురించి నివేదికలు వెలువడిన తర్వాత సమాచారాన్ని సేకరించేందుకు జిల్లా ఆరోగ్య అధికారి క్లీనిక్ ని సందర్శించారు. ఈ సందర్భంగా స్పందించిన ఆయన... ఈ ఘటనను సీరియస్ గా పరిగణిస్తున్నామని.. క్లీనిక్ సిబ్బంది, యాజమాన్యం నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నమని ఆయన తెలిపారు. ఇదే సమయంలో సమగ్ర దర్యాప్తు కోసం ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది. మరోపక్క కద్రి స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు!

## సెంథిల్ బాలాజీకి భారీ ఊరట..

**తమిళనాడు– నవభూమి:**తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ కి భారీ ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో ఆయనకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. వారానికి రెండు సార్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు హాజరు కావాలి, సాక్షులను తారుమారు చేయరాదు, పాస్‌పోర్టును అప్పగించాలి వంటి షరతులతో బెయిల్ ఇచ్చింది. సుప్రీం తీర్పుతో దాదాపు 15 నెలల తర్వాత ఆయన జైలు నుంచి బయటకు రానున్నారు. కాగా, గత ఏడాది జూన్ 14న మనీలాండరింగ్ కేసులో బాలాజీని ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో బాలాజీపై చెన్నై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు డబ్బుకు ఉద్యోగా కుంభకోణం కేసు నమోదు చేశారు. ఈ కేసులో పెద్దఎత్తున డబ్బు చేతులు మారిందన్న ఆరోపణలపై ఈడీ బాలాజీని అరెస్టు చేసింది. జైలులో ఉన్నప్పటికీ బాలాజీని సీఎం స్టాలిన్ తన మంత్రివర్గంలోనే కొనసాగించారు.

## ఢిల్లీ నూతన ముఖ్యమంత్రి అతిశీకి జెడ్ కేటగిరీ భద్రత

**న్యూఢిల్లీ– నవభూమి:**ఢిల్లీ సీఎంగా అతిశీ సోమవారం బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎంకు ఢిల్లీ పోలీసులు జెడ్ కేటగిరీ భద్రతను కేటాయించారు. సీఎం కాన్వాయ్‌లో ఒక పైలట్‌తో సహా పోలీసు సిబ్బందితో భద్రతను కల్పించనున్నట్లు సదరు అధికారులు వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం.. కేంద్ర హెూం శాఖ ఆదేశాల మేరకు ఢిల్లీ సీఎం జెడ్ కేటగిరీ భద్రతకు అర్హులు. ఇందుకోసం 22 మంది సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా పనిచేస్తారు. జెడ్ కేటగిరీలో పీఎస్వోలు, ఎస్కార్ట్స్, సాయుధ గార్డులు ఉంటారు. ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా అతిశీ శనివారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్ నివాస్‌లో జరిగిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆమెతోపాటు ఆప్ నేతలు గోపాల్‌రాయ్, కైలాశ్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్, అహ్లావత్ క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అతిశీ ఢిల్లీకి ఎనిమిదో ముఖ్యమంత్రి కాగా, అత్యంత పిన్న వయస్కురాలైన సీఎంగా ఆమె రికార్డులకెక్కారు. అలాగే, ఢిల్లీ పీఠాన్ని అధిష్టించిన మూడో మహిళగానూ మరో ఘనత సాధించారు. సోమవారం ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన అతిశీ, కేజ్రీవాల్ వాడిన కుర్చీని కాకుండా మరో కుర్చీ వేసుకొని విధులు నిర్వర్తించారు. రామాయణంలో భరతుడిలా నాలుగు నెలలపాటు ఢిల్లీకి సీఎంగా ఉంటానని ఆమె అన్నారు. అయితే అతిశీ వేరే కుర్చీలో కూర్చొని రాజ్యాంగాన్ని, సీఎం స్థాయిని అవమానపర్చారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

## ఆ ప్రయోగానికి ఇబ్బందులు..

# వారిద్దరూ అంతరిక్షంలోనేనా?



**న్యూఢిల్లీ– నవభూమి:** అమెరికా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ అంతరిక్ష కేంద్రం (స్పేస్ స్టేషన్)లోనే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. జూన్ 5న వీరిద్దరూ బోయింగ్ కంపెనీకి చెందిన స్టార్ లైనర్ క్యాప్సూల్ లో అంతరిక్ష కేంద్రానికి బయలుదేరి వెళ్లారు. తిరిగి అప్పటి నుంచి ఎనిమిది రోజుల్లో అంటే జూన్ 13న భూమికి తిరిగి వచ్చేయాల్సి ఉండగా స్టార్ లైనర్ వైఫల్యంతో సునీతా విలియమ్స్, బుల్ విల్మోర్ అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. కాగా సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్ లను అంతరిక్ష కేంద్రానికి చేర్చడంలోనూ స్టార్ లైనర్ క్యాప్యూల్ తీవ్ర ఇబ్బందులు పెట్టింది. పలు సాంకేతిక సమస్యలు దాన్ని చుట్టుముట్టాయి. దీంతో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం కావడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో స్టార్ లైనర్ క్యాప్యూల్ ఒంటరిగానే అంతరిక్ష కేంద్రం నుంచి తిరిగొచ్చేసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సెప్టెంబర్ 6 సాయంత్రం బయలుదేరి సురక్షితంగా న్యూమెక్సికోలోని వైట్ సాండ్స్ మిస్సైల్ రేంజ్ లో దిగింది. సహనం నశిస్తోంది.. అణుబాంబు దాడికీ వెనుకాడను.. పుతిన్ పలు పరీక్షలు చేపట్టాక స్టార్ లైనర్ క్యాప్సూల్ సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్ లను తీసుకురావడానికి అనుకూలం కాదని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) నిర్ధారించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అంతరిక్ష కేంద్రంలోకి సెప్టెంబర్ 26న స్పేస్ ఎక్స్ కు చెందిన క్రూ9 (డ్రాగన్ క్యాప్యూల్) ను పంపించాలని నిర్ణయించారు. ఇందులో సాధారణంగా నలుగురు వ్యోమగాములు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. అయితే సునీత, విల్మోర్ లను తీసుకురావడానికి డ్రాగన్ క్యాప్సూల్ లో ఇద్దరినే పంపుతున్నారు. ! ఈ నేపథ్యంలో డ్రాగన్ క్యాప్సూల్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సునీత, విల్మోర్ లను తీసుకొని వెనక్కి వస్తుంది. డ్రాగన్ ల్యాండ్ కావడానికి వీలుగా స్టార్ లైనర్ క్యాప్సూల్ ను అంతరిక్ష కేంద్రంలో ఖాళీ చేశారు. అయితే స్పేస్ ఎక్స్ కు చెందిన క్రూ%–%9 మిషన్ ను సెప్టెంబర్ 26న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపాలని నాసా, స్పేస్ ఎక్స్ భావించాయి. అయితే ఈ ప్రయోగం సెప్టెంబర్ 28కి వాయిదా పడింది. గల్ఫ్ ఆఫ్ మెక్సికో, ఫ్లోరిడా పశ్చిమ తీరంలో ఉష్ణమండల తుపాను హెలెన్ కారణంగా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ మిషన్ ను వాయిదా వేశారని తెలుస్తోంది. కాగా సునీత, విల్మోర్ వెళ్లిన బోయింగ్ కు స్టార్ లైనర్ క్యాప్సూలే తొలి అంతరిక్ష ప్రయోగం కావడం గమనార్హం. ఇందులో థ్రస్టర్లు ఆగిపోయి చికాకు పెట్టడం, హీలియం లీక్ తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 13న బయలు దేరాల్సిన సునీత, విల్మోర్ అక్కడే చిక్కుకుపోయారు. వారిద్దరూ వచ్చే ఫిబ్రవరి వరకు భూమికి తిరిగొచ్చే అవకాశం లేకపోవడంతో వారి ఆరోగ్యంపై ఆందోళన నెలకొంది. ముఖ్యంగా సునీత ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## నాగాలాండ్, అరుణాచల్‌లో.. సాయుధ దళాల ప్రత్యేక చట్టం పొడిగింపు



**న్యూఢిల్లీ– నవభూమి:** నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొని జిల్లాల్లో సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం (ఏఎఫ్ఎస్పీఏ)ను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ రెండు ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నది. సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం 1958 (28 ఆఫ్ 1958) సెక్షన్ 3 ద్వారా సంక్రమించిన అధికారాలను కేంద్ర ప్రభుత్వం వినియోగించింది. నాగాలాండ్‌లోని ఎనిమిది జిల్లాలు, మరో ఐదు జిల్లాల పరిధిలోని 21 పోలీస్ స్టేషన్లు, అరుణాచల్ ప్రదేశ్‌లోని మూడు జిల్లాలను 'డిస్టర్బ్ ఏరియా'గా పేర్కొంది. 2024 ఏప్రిల్ 1 నుంచి ఆరు నెలల వరకు అమలులో ఉన్న సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టాన్ని మరో ఆరు నెలలపాటు పొడిగించినట్లు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. నాగాలాండ్‌లో శాంతి భద్రతల పరిస్థితిపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించింది.

కాగా, శాంతి భద్రతలు లోపించిన ప్రాంతాలను 'అంతరాయం కలిగించే' ప్రాంతాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. ఆయా ప్రాంతాలలో పనిచేసే భద్రతా దళాలకు సాయుధ దళాల (ప్రత్యేక అధికారాలు) చట్టం కింద ప్రత్యేక అధికారాలు కల్పిస్తుంది. ప్రజా శాంతి నిర్వహణ కోసం సోదాలు చేసేందుకు, అరెస్టు చేసేందుకు, అవసరమైతే కాల్పులు జరిపేందుకు ఏఎఫ్ఎస్పీఏ ద్వారా విస్తృత అధికారాలు ఇస్తుంది.

## పరువు నష్టం కేసు.. ఎంపీ సంజయ్ రౌత్‌కు 15 రోజుల జైలు శిక్ష



**న్యూఢిల్లీ– నవభూమి:**బీజేపీ మాజీ ఎంపీ కిరీట్ సోమయ్య భార్య మేధా సోమయ్య దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ముంబై కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో శివసేన (యూబీటీ) నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ కు జైలు శిక్ష విధించింది. సెక్షన్ 500 కింద సంజయ్ రౌత్‌ను దోషిగా నిర్ధారించిన ముంబై కోర్టు ఆయనకు 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. అంతేకాదు, రూ.25 వేల జరిమానా కూడా వేసింది. కాగా, కిరీట్ సోమయ్య కుటుంబ సభ్యులు ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తున్నారు. అయితే, ముంబై శివారులోని మీరా భయందర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.100 కోట్ల టాయిలెట్ స్కామ్ జరిగిందని ఆరోపిస్తూ శివసేనకు చెందిన సామ్నా పత్రికలో వరుస కథనాలు వచ్చాయి. అంతకు ముందు కూడా సోమయ్య కుటుంబీకులు నడిపిస్తోన్న స్వచ్ఛంద సంస్థకు ఇందులో భాగస్వామ్యం ఉందని సంజయ్ రౌత్ ఆరోపించారు. ఈ క్రమంలోనే మేధా సోమయ్య 2022 ఏప్రిల్‌లో సంజయ్ రౌత్‌పై పరువు నష్టం దావా వేశారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా టాయిలెట్ స్కామ్ పేరుతో శివసేనకు చెందిన సామ్నా పత్రికలో వస్తోన్న కథనాలు తన పరువుకు నష్టం కలిగించేవిలా ఉన్నాయని అందులో పేర్కొన్నారు. తన పరువుకు నష్టం కలిగించినందుకు క్షమాపణలు చెప్పడంతోపాటు వ్యక్తిగతంగా తనకు భంగం కలిగించే కథనాలను ప్రచురించకుండా ఆదేశాలు ఇవ్వాలని తన పిటిషన్ ద్వారా కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన ముంబై కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది.


## ముగ్గురు పిల్లల్లో ఒకరికి కంటి చూపు సమస్య.. కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత పెరిగిన కేసులు



**న్యూఢిల్లీ– నవభూమి:** కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా చిన్న పిల్లల్లో దృష్టిలోపం సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు గుర్తించారు. చిన్నారుల్లో హ్రస్వ దృష్టి, దగ్గర చూపు సమస్యలు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు ఓ స్టడీలో తేల్చారు. బ్రిటీష్ జర్నల్ ఆఫ్ ఆప్థమాలజీ దీనిపై రిపోర్టును పబ్లిష్ చేసింది. సుమారు ఆరు ఖండాలకు చెందిన 50 దేశాల్లోని 50 లక్షల మంది చిన్నారులను అధ్యయనం చేసిన తర్వాత ఈ రిపోర్టును రిలీజ్ చేశారు. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా మయోపియా కంటి సమస్యలు లక్షలాది మంది చిన్నారుల్లో నమోదు కానున్నట్లు రిపోర్టులో తెలిపారు. కరోనా వల్ల లాక్‌డౌన్ విధించిన సమయంలో.. ఇంట్లోనే ఉన్న పిల్లలు ఎక్కువ శాతం స్క్రీన్ టైంను పెంచేశారని, దీనికి తోడు ఆరుబయట ఆడే సమయాన్ని తగ్గించారని, దీని వల్ల కంటి సమస్యలు అధికమైనట్లు రిపోర్టులో వెల్లడించారు.

దగ్గర కంటి చూపు సమస్యలు ఆసియాలో అధికంగా ఉన్నట్లు తేలింది. ఆసియాలోని జపాన్ చిన్నారుల్లో ఆ సమస్య 85 శాతం ఉందని, దక్షిణ కొరియాలో 73 శాతం ఉన్నట్లు గుర్తించారు. ఇక చైనా, రష్యా దేశాల్లో ఆ సమస్య 40 శాతం పిల్లల్లో ఉన్నట్లు తేల్చారు. పరాగ్వే, ఉగాండా దేశాల్లో అత్యల్ప స్థాయిలో ఈ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఆ దేశాల్లో కేవలం ఒక్క శాతం మాత్రమే సమస్య ఉన్నది. బ్రిటన్, ఐర్లాండ్, అమెరికా దేశాల్లో ఆ సమస్య 15 శాతంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా మయోపియా దృష్టి సమస్యలు.. 1990 నుంచి 2023 వరకు మూడు రెట్లు అధికమైనట్లు స్టడీలో తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 36 శాతం పిల్లల్లో ఈ సమస్యలు వస్తున్నట్లు గుర్తించారు. కరోనా మహమ్మారి తర్వాత ఇది మరింత పెరిగినట్లు అంచనా వేశారు. ప్రైమరీ స్కూల్ దశలో మయోపియా సమస్యలు మొదలవుతాయని, 20 ఏళ్ల వరకు కంటి సమస్యలు వస్తాయి. 2050 నాటికి ప్రపంచంలోని టీనేజర్లలో సగం మందికి మయోపియా వ్యాధి బారినపడుతారని రిపోర్టులో తెలిపారు. మయోపియా సమస్య నుంచి బయటపడాలంటే, ప్రతి రోజు పిల్లలు కనీసం రెండు గంటల పాటు బయట గడపాలని, ఏడు నుంచి 9 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు ఇది చాలా ముఖ్యమని నిపుణులు సూచించారు.

## ప్రధాని మోదీ పుణె పర్యటన రద్దు



**న్యూఢిల్లీ– నవభూమి:** ప్రధాని నరేంద్ర మోదీ( ఇవాళ పుణె పర్యటన రద్దు అయ్యింది. భారీ వర్షాల వల్ల ఆ ట్రిప్ క్యాన్సిల్ చేశారు. పుణెలో మెట్రో రైలును మోదీ ప్రారంభించాల్సి ఉన్నది. దానితో పాటు అనేక అభివృద్ధి ప్రాజెక్టుల్లో అతను పాల్గొననున్నారు. అయితే వర్షాల కారణంగా పుణెలో మోదీ పర్యటన రద్దు చేశామని, త్వరలో కొత్త తేదీని ప్రకటించనున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. బుధవారం సాయంత్రం భారీగా వర్షం కురిసింది. ఎస్పీ కాలేజీ గ్రౌండ్‌లో మోదీ సభను నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ గ్రౌండ్ పూర్తిగా నీటమయం అయ్యింది. సభా ప్రాంగణాన్ని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్.. బుధవారం విజిట్ చేశారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. కానీ గురువారం కూడా పుణెతో పాటు ముంబైలో భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక చేసిన నేపథ్యంలో మోదీ ట్రిప్‌ను రద్దు చేశారు.

## ముంబైలో వర్ష బీభత్సం.. నేడు విద్యా సంస్థలకు సెలవు



దేశ ఆర్థిక రాజధాని ముంబై )లో వర్ష బీభత్సం సృష్టించింది. బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి నగరం అతలాకుతలమైంది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రధాన రహదారులు, కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ వర్షం కారణంగా విమాన, రైలు సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. స్పైస్‌జెట్, విస్తారా సహా పలు విమానాలను అధికారులు దారి మళ్లించగా.. మరికొన్నింటిని రద్దు చేయాల్సి వచ్చింది. గురువారం ఉదయానికి వరద ప్రభావం తగ్గడంతో ఆయా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. పలు రైలు సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో నేడు అన్ని విద్యా సంస్థలకు అధికారులు సెలవు ప్రకటించారు బుధవారం సాయంత్రం కేవలం 5 గంటల వ్యవధిలోనే నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో 100 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. సబర్బన్ అంధేరిలో భారీ వర్షం కారణంగా వరద ప్రవాహానికి ఓ మహిళ కొట్టుకుపోయింది. ఇక తూర్పు శివారు ప్రాంతాల్లో ఉదయం 8 నుండి రాత్రి 10 గంటల మధ్య అత్యధిక సగటు వర్షపాతం 169.85 మిల్లీ.మీ నమోదైంది. ఆ తర్వాత తూర్పు శివారు ప్రాంతాల్లో 169.85 మి.మీ, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 104.17 మి.మీ వర్షం కురిసింది.

## జిల్లాలవారీ వర్గీకరణ సరైన నిర్ణయం!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల్లోని మొత్తం 59 ఉపకులాలకు భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన 15శాతం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన జిల్లాల వారీగా వర్గీకరణ చేయడమే సరైనది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటారన్న ఖ్యాతి ఉన్నది. ఈ సామాజిక సంస్కరణ కోణంలోనే ఎస్సీల్లోని అసమానతలను తొలగించాలంటే ఎస్సీ రిజర్వేషన్లను జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయడమే మార్గమని చంద్రబాబు నాయుడు నిర్ణయించారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ముప్పై ఏళ్ళ పాటు చేసిన ఎన్నో పోరాటాల తర్వాత, భారత ప్రధాని మోదీ హామీతో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ సుప్రీంకోర్టులో వేగంగా ముందుకు కదిలింది. ఇదే సమయంలో మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి మేరకు తెలుగుదేశం పార్టీ అధినేతగా మాజీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అందువల్లనే మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాదిగలు 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంలో వాడవాడలా ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించారు. ఎన్డీఏ గెలుపే మాదిగల గెలుపుని నినదించారు. ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అఖండ మెజారిటీతో విజయం సాధించింది. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి స్థాయిలో పునరుద్ఘాటించారు. ఎట్టకేలకు 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్ర చూడ్ ఆధ్వర్యంలోని ఏడుగురు సభ్యులు గల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఒక చారిత్రాత్మక తీర్పును వెల్లడించింది.

ఈ తీర్పు వెలువడిన నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఏర్పాటు చేయబడిన సభలో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని, జిల్లాల వారీగా వర్గీకరణ చేసి ఎస్సీలలోని అన్ని ఉపకులాలకు సమన్యాయం చేస్తామని, గతంలోనే ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీ ఉపకులాలకు సామాజిక న్యాయం చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే అంటూ సుప్రీంకోర్టు తీర్పుపై సానుకూలంగా స్పందించారు. ఆ తర్వాత జరిగిన తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సమావేశంలో కూడా ఎస్సీ వర్గీకరణ చేస్తామని తీర్మానం చేశారు. ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అమరావతిలో జరిగిన సభలో కూడా ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. అయితే జిల్లాల యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంతో అనంతపురం జిల్లా మాదిగలు సంబరపడిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మాదిగలు అత్యధికంగా జనాభా కలిగిన జిల్లా అనంతపురం జిల్లా. అందువల్ల ఈ జిల్లాలో పేదరికం, వెనుకబాటుతనం, నిరుద్యోగిత ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలో మాదిగలకు దాదాపు 12 శాతం రిజర్వేషన్లు రావడానికి అవకాశం ఉందని, మా బతుకులు బాగుపడిపోతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల జనాభా 16శాతం. అందులో మాలలు 7.5శాతం, మాదిగలు 6.5శాతం, రెల్లి, ఇతర ఉపకులాలు 2శాతం జనాభా కలిగి ఉన్నాయి. ఇందులో వర్గీకరణ కోరుతున్న కులాల జనాభా 9.5శాతం, వర్గీకరణను వ్యతిరేకిస్తున్న మాలల జనాభా 8.5శాతం మాత్రమే, అంతిమంగా ఎస్సీ వర్గీకరణ కోరుకుంటున్న కులాల జనాభానే 1 శాతం ఎక్కువ ఉంది. తెలుగుదేశం పార్టీ ఆది నుండి మాదిగ సమాజానికి అండగా నిలుస్తూనే ఉంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో మాదిగ సామాజికవర్గానికి చెందిన మహేంద్రనాథ్‌ను ఆర్థికశాఖ మంత్రిగా చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే. అదేవిధంగా ఇదే తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం రాష్ట్ర హోం మంత్రిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనిత పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేకంగా ఎస్సీల విద్యాభివృద్ధి కోసం ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం, అంబేడ్కర్ విదేశీ విద్యా పథకం లాంటి 27 పథకాలు అమలు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే. మాదిగల అభ్యున్నతి పట్ల తెలుగుదేశం పార్టీకి సానుకూల దృక్పథం ఉండడం వల్లనే ఈనాడు సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానిస్తూ విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణ చేయడానికి ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లాల యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న చంద్రబాబునాయుడు నిర్ణయాన్ని మాదిగ, ఉపకులాలు వేనోళ్ల కొనియాడుతున్నాయి.

# ఆపన్న హస్తమా? అందని ద్రాక్షా?



తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని సాహసోపేత నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. సమగ్ర అధ్యయనం లేకుండా వెలువడుతున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అనుమానాలు కూడా కలిగిస్తున్నాయి.

గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న ప్రవాసుల కుటుంబాల సంక్షేమం కొరకు తాజాగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు సమస్త ఎడారి దేశాలలోని ప్రవాసులలో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. నాలుగు అంశాలతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులో ఎడారి దేశాలలో పని చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు ఐదు లక్షల రూపాయాల ఎక్స్‌గ్రేషియా చెల్లించే అంశమే ప్రథమంగా ఉంది. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన డిసెంబర్ 7, 2023 నుంచి గల్ఫ్ దేశాలలో మరణించిన ప్రవాసులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే ఆ నిర్ణయం అమలు విధి విధానాలు ఏమిటో స్పష్టం చేయలేదు.

ప్రతి ప్రభుత్వ సహాయానికి అర్హత విధానం ఉంటుంది. అయితే గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయాలు చెల్లించే ఈ పథకంలో లాభోక్తుల ఎంపిక విధానం ఏమిటి అనేది ప్రభుత్వ ఉత్తర్వులో విశదీకరించలేదు. ఈ కారణంగా, గల్ఫ్ దేశాలలో మరణించిన వారి కుటుంబాలు గంపెడాశతో ఆ ఎంపిక పద్ధతిని తెలుసుకోవడానికి ఎదురు చూస్తున్నాయి.

వాస్తవానికి ప్రవాసులు ఎక్కువగా ఉండి విభిన్న ప్రవాసీ సంక్షేమ పథకాలు అమలుపరిచే కేరళ, పంజాబ్ రాష్ట్రాలు కూడా ఈ రకమైన ఎక్స్‌గ్రేషియా పథకాన్ని ప్రకటించలేదు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక బీమా పథకాన్ని ప్రవేశపెట్టి అమలుపరిచారు. తద్వారా ఈ రకమైన బాధిత కుటుంబాలకు కొంతవరకు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. విదేశాలకు ఉపాధి వలసలు అనేది కేంద్ర ప్రభుత్వ విదేశీ విధానంలో భాగంగా ద్వైపాక్షిక ఒప్పందాలకు అనుగుణంగా జరగడం పరిపాటి. అందులో ఉపాధికై దేశం బయటకు వెళ్లే భారతీయుడి భద్రత అంశం కూడా కీలకంగా ఉంటుంది. వివిధ కారణాల వలన అది సరిగ్గా అమలు కాలేకపోతుందనేది వేరే విషయం.

రాచరిక వ్యవస్థ అమలులో ఉండే గల్ఫ్ దేశాలలో కేవలం స్థానిక యాజమానులు పిలిపించినవారే వీసాలు పొంది ఉద్యోగాలకు రావాలి. వీసా గడువు ముగిసిన తర్వాత తిరిగి వెళ్ళిపోవాలి. ఉద్యోగ కాలంలో అనారోగ్యానికి గురయితే చికిత్స అందించడం పిలిపించిన యాజమాని బాధ్యత. అదే విధంగా ఉద్యోగి మరణిస్తే మృతదేహాన్ని స్వదేశానికి పంపించడం కూడ యాజమాని కర్తవ్యం. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణిస్తే పరిహారం కూడ చెల్లించాలనేది ఒప్పందంలో భాగమే. ప్రతికూల పరిస్థితులు, చట్టాల కాఠిన్యంలో చిక్కుకుపోయిన భారతీయుల మృతదేహాలను కొన్ని సందర్భాలలో మానవతా దృక్పథంతో స్వదేశానికి తరలించడానికి అయ్యే వ్యయాన్ని భారతీయ రాయబార కార్యాలయాలు భరిస్తాయి. అయితే ఇది పూర్తిగా భారతీయ రాయబార కార్యాలయాల అంతర్గత విషయం. కనుక అవి ఎప్పుడూ ఆ వివరాలను బహిర్గతం చేయవు. బహిర్గతమైతే స్థానిక యాజమాన్యాలు తమ కనీస బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించుకుని తమ బాధ్యతను పూర్తిగా భారత ప్రభుత్వంపై రుద్దుతారనే ఉద్దేశంతో మానవతాపూర్వక వ్యయాల విషయంలో వీలయినంత గోప్యత పాటించడం జరుగుతుంది. మరణించిన వారికి రావాల్సిన బకాయి వేతనాలు ఇతర చెల్లింపుల గురించి సంబంధిత స్థానిక కార్మిక మంత్రిత్వ శాఖ అధికారులతో అధికృత సమాచారాన్ని పొంది, బ్యాంకు ద్వారా అందిన తర్వాత మాత్రమే ఫైళ్లను ముగిస్తారు.

కడప జిల్లాలో గల్ఫ్ వలసల ప్రభావం ఎక్కువ. ఈ కారణాన గల్ఫ్ మృతులు, బాధితుల సహాయార్థం గతంలో వైయస్ రాజశేఖర రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కొన్ని చర్యలు చేపట్టారు. అయితే నాటి గవర్నర్ నరసింహన్ అభ్యంతరం తెలిపారు. పైగా అప్పటి విదేశీ వ్యవహారాల మంత్రి ప్రణబ్ ముఖర్జీ సైతం ఆ మానవతా పూర్వక వ్యయాలు రాష్ట్రాల పరిధిలోని అంశం కాదని స్పష్టం చేశారు. దీంతో వైయస్‌తో పాటు ఎంతో ఉత్సాహంగా ముందుకు వెళ్లిన (అప్పుడు ఇప్పుడూ) మంత్రి అయిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చల్లబడ్డారు. హైదరాబాద్ నుంచి స్వంత స్థలాలకు మృతదేహాలను తరలించేందుకు పేదలకు కనీసం ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని ఆ సందర్భంగా నేను సూచించాను. నా సూచనతో మంత్రి శ్రీధర్‌బాబు ఏకీభవించారు. ఫలితంగానే ఆ ఉచిత అంబులెన్సు విధానం అమలులోకి వచ్చింది.

తెలంగాణ యువత బతుకులు దుబాయి, బొగ్గుబాయి, బొంబాయికి మాత్రమే పరిమితమా అంటూ ప్రత్యేక ఉద్యమ కాలంలో నినదించిన కె.చంద్రశేఖర్‌రావు అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత గల్ఫ్‌లోని కొన్ని వర్గాలలో ఆశలు చిగురించాయి, ఈ దిశగా ఆయన కొన్ని ప్రకటనలు కూడ చేసారు, తన హయాంలోని కీలక అధికారులు నర్సింగరావు, సోమేశ్ కుమార్‌ల ద్వారా దీనిపై ప్రత్యేకంగా అధ్యయనం కూడ చేయించి ఆ తర్వాత మిన్నకుండిపోయారు. వాస్తవ పరిస్థితుల గురించి అవగాహన ఉన్న శ్రీధర్‌బాబు ఈ సారి మంత్రివర్గంలో కీలకంగా ఉన్నా ప్రవాసుల సంక్షేమ విధానంపై మౌనంగా ఉండడం గమనార్హం. తెలుగునాట చెబుతున్నట్లుగా, గల్ఫ్‌లో మరణించిన మలయాళీలకు కేరళ ప్రభుత్వం ఎలాంటి నగదు సహాయం చేయదు. ఎడారి దేశాలలోని మలయాళీలు స్వచ్ఛందంగా సామూహిక బీమా పథకంలో భాగస్వాములు అవుతారు. ప్రస్తుతం ఖతర్, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ దేశాలలోని భారతీయులకు కూడ స్వల్ప విరాళంతో కూడిన బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత రేవంత్ సర్కారు ఈ విషయమై ప్రకటన చేస్తే మరింత స్పష్టత వచ్చేది.



# దళితులపై దాడులు.. దేశంలో అంతకంతకు పెరిగిపోతున్న కుల వివక్ష



దేశంలో దళితులపై దాడులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. రాజ్యాంగ రక్షణలు, రాజకీయ ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ అట్టడుగువర్గాల ప్రజలపై కుల వివక్ష, హింస తగ్గకపోగా అంతకంతకు పెరుగుతుండటం గమనార్హం. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్సీఆర్బీ) తాజాగా విడుదల చేసిన 2022 నివేదిక ఈ విషయాన్నే ఎత్తిచూపింది. మొత్తం నమోదైన కేసుల సంఖ్య 51,656కు పెరిగింది. 2021తో పోలిస్తే ఇది 13 శాతం అధికం. ఇందులో సుమారు 98 శాతం కేసులు 13 రాష్ట్రాలకు చెందినవే. ఉత్తరాదికి చెందిన యూపీలో 12,287 (23.78%), రాజస్థాన్‌లో 8,651 (16.75%), మధ్యప్రదేశ్‌లో 7,732 (14.97%) కేసులు నమోదైనట్టు ఆ నివేదిక వెల్లడించింది.


బీహార్, ఒడిశా, మహారాష్ట్ర తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మొత్తం కేసుల్లో ఈ ఆరు రాష్ట్రాల వాటా 81 శాతం వరకు ఉంటుంది. గత జూలైలో ఈ అంశంపై సామాజిక న్యాయశాఖ మంత్రి రామ్‌దాస్ అథవాలే పార్లమెంటులో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు ఒక్కటే పరిష్కారమన్నారు. కానీ, అత్యధిక కేసులున్న 14 రాష్ట్రాల్లో 498 జిల్లాలుంటే 194 జిల్లాల్లోనే ప్రత్యేక న్యాయస్థానాలున్నాయి. అత్యధిక కేసులు నమోదైన యూపీలో ఎస్సీలపై అత్యాచారాలు జరిగే ప్రాంతాల గుర్తింపే జరగలేదు.

దళిత బహుజనుల అభ్యున్నతికి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని బాకాలూదుకునే పార్టీల పాలనలో ఏండ్ల తరబడి కొనసాగిన రాష్ట్రాల్లో ఎస్సీలపై అత్యాచారాలు అత్యధిక స్థాయిలో నమోదు కావడం గమనార్హం. తూతూమంత్రం చందంగానే దళితుల క్షేమం, సంక్షేమం అక్కడ అమలవుతుండటమే ఇందుకు కారణం. నిచ్చెనమెట్ల కులవ్యవస్థను నడిపించే ఆధిపత్య భావజాలం వెర్రితలలు వేయడంపై అనునిత్యం వార్తలు వెలువడుతూనే ఉంటాయి.

దళిత పెండ్లికొడుకు గుర్రం మీద ఊరేగరాదని, దళితులు చెప్పులు వేసుకుని వీధుల్లో తిరగొద్దని, మీసాలు పెంచొద్దని, తలపాగాలు పెట్టుకోవద్దని హుకుం జారీ చేసే సంస్కృతి ఇప్పటికీ కొనసాగుతుండటం సభ్య సమాజానికి తలవంపులు తెస్తున్నది. ఈ ఆధిపత్య భావజాలమే అంతిమంగా దాడులకు దారితీస్తున్నది. ఇలాంటివి జరిగినప్పుడు పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ పనితీరు సందేహాస్పదం అవుతుంటుంది. నమోదయ్యే కేసుల్లో 61 శాతం మాత్రమే చార్జిషీటు దాకా వెళ్లడం ఇందుకు ఉదాహరణ. దళితులపై అత్యాచారాల నివారణకు బహుముఖ, దీర్ఘకాలిక వ్యూహం అనుసరించాల్సిన అవసరం ఉందని చెప్పకతప్పదు. సామాజిక నిర్మాణాన్ని సమూలంగా మార్చడమూ తప్పనిసరి. సమాజానికి న్యాయం ప్రాముఖ్యతను వివరించేందుకు పటిష్ఠమైన ప్రచారోద్యమం ఏదీ లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. కులవివక్షకు వ్యతిరేకంగా బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించేలా ప్రజల్లో చైతన్యం పెంచేందుకు జాతీయ స్థాయిలో కృషి జరగాలి. బడులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల పాఠ్యాంశాల్లో ఈ అంశానికి ప్రాధాన్యమివ్వాలి. చట్టాలకు ప్రజా చైతన్యం తోడైనప్పుడే దళితులపై అత్యాచారాలు, దాడులను రూపుమాపడం సాధ్యపడుతుంది.

# ధర్మాన్ని ఆచరించండి..అన్నీ లభిస్తాయి

భక్తి



వేదవ్యాసుడి జీవిత కథ ఆద్యంతం అద్భుతం. వ్యాసుడు వసిష్ఠుడికి ముని మనమడు. శక్తి మహర్షికి పౌత్రుడు. పరాశరుడి పుత్రుడు. తపోనిధి అయిన పరాశరుడు యమున దాటడానికి పడవ ఎక్కడమేమిటి? దాటించేందుకు తండ్రి స్థానంలో దాశ పుత్రి తాను పడవ నడపడమేమిటి? మహర్షి అకస్మాత్తుగా మత్స్య గంధిని మోహించడమేమిటి? తన తపశ్శక్తి ద్వారా ఆమె అభ్యంతరాలన్నిటినీ తొలగించటమేమిటీ? ఆ యమునా నదీ ద్వీపంలో ఆమెకు అయాచితంగా పుత్రుడిని ప్రసాదిం చటమేమిటి? అప్పటికప్పుడే సకల శాస్త్రవేత్త అయిన పుత్రుడు పుట్టు కురావడమేమిటి? పుడుతూనే తల్లిని విడిచి తపోవనాలకు వెళ్లిపోవటమేమిటి? ఇదంతా లోక కల్యాణం కోసం లోకాతీతుడిని అవతరింపజే సేందుకు లోకేశ్వరుడు ప్రదర్శించిన విచిత్ర విలాసం. ఆ కారణజన్ముడి జన్మకు ప్రయోజనం మాన వాళికి చతుర్విధ పురుషార్థ సాధన రహస్యాలను బహువిధాలుగా బోధించటం. అందుకే ఆయన జగద్గురువులకే గురువుగా నిలిచిపోయాడు. అగమ్యంగా ఉన్న వేదరాశి చిక్కులు విప్పి, చక్కబరచి, అధ్యయనానికి అనువుగా చతుర్వేదాలుగా విభజించి, వైదిక ధర్మప్రవర్తనం చేసిన ఆది గురువు వేదవ్యాసుడు. పంచమవేదమైన భారతేతిహాసం ద్వారా 'ధర్మాన్ని ఆచరించండి. అన్నీ లభిస్తాయి' అని పదేపదే ఎలుగెత్తి ఘోషించిన సకల లోక హితైషి సాత్యవతేయుడు. అర్థ కామ సాధనల విషయాలను విస్త రించి, అనేక నీతి కథల భాండాగారాలైన అష్టాదశ పురాణాల ద్వారా అందరికీ అందుబాటులోకి తెచ్చిన ఆప్తుడు వ్యాసుడు. బాదరాయణ బ్రహ్మ సూత్రాల ద్వారా వేదాంత సారాన్ని సూత్రీకరించి, మనుషులందరికీ మహత్తర లక్ష్యమైన మోక్ష పురుషార్థానికి బంగారు బాట పరచిన వాడూ పరాశరుడే. ఇంతటి మహోపకారి అయిన ఈ జ్ఞాన చంద్రుడు ఉదయించిన ఆషాఢ పూర్ణిమ శుభతిథిని ఆసేతు శీతాచలమూ గురు పూర్ణిమ పర్వదినంగా జరుపుకోవటం సర్వవిధాలా సముచితమైన సంప్రదాయం. ఆ సందర్భంగా ప్రత్యేకంగా అస్మాదాచార్య పర్యంతమైన గురుపరంపరను సాదరంగా సంస్మరించుకొని, యథాశక్తి కృత జ్ఞతను ప్రకటించుకోవటం మన కనీసపు కర్తవ్యం.

## కిచెన్‌లో వస్తువుల అమరిక ఇలా...

కిచెన్‌లో స్టోరేజ్ సమస్య చాలామందికి ఎదురయ్యేదే. ఏది ఎక్కడ పెట్టాలో తెలియక ఎక్కడో ఓ చోట పెట్టేస్తారు. మళ్లీ దాని కోసం కిచెన్ మొత్తం వెతుకుతారు. అయితే కాస్త ఓపికగా కిచెన్‌ను సర్దుకుంటే ఇలాంటి ఇబ్బందులు దరిచేరకుండా ఉంటాయి. కిచెన్‌లో వస్తువుల అమరికలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు. కిచెన్‌లో స్టోరేజ్ సమస్య తీరాలంటే ముందుగా పనికిరాని వస్తువులను తీసేయాలి. ఇందుకోసం క్యాబినెట్స్‌లో నుంచి వస్తువులన్నీ తీసి బయటపెట్టాలి. వాటిని మూడు రకాలుగా విభజించాలి. ఒకటి ట్రాష్ బిన్‌లో వేసేవి. రెండో రకం డొనేట్ చేసేవి. మూడో రకం అవసరమైనవి. ఈ మూడో కేటగిరీకి చెందిన వస్తువులను మాత్రమే క్యాబినెట్‌లో సర్దుకోవాలి. ఇలా చేయడం వల్ల కిచెన్‌లో సగం పనికిరాని వస్తువులు బయటకు వెళ్లి స్థలం కలిసొస్తుంది. క్యాబినెట్స్, షెల్ఫ్‌లు క్లీన్ చేశాక కిచెన్ వస్తువులను కేటగిరీలుగా విభజించుకోవాలి. అంటే కుక్‌వేర్, డిన్నర్‌వేర్, తినే ఆహారపదార్థాలు.. ఇలా కేటగిరీలుగా విభజించుకోవాలి. వంట పాత్రలు, ప్యాన్‌లు, కటింగ్‌బోర్డ్, ప్లేట్లు, గ్లాసులు... ఇవన్నీ కుక్‌వేర్‌లోకి వస్తాయి. వీటిని



ఒక క్యాబినెట్‌లో సర్దుకోవాలి. డ్రింక్‌లు, బేకింగ్‌కు ఉపయోగించే పదార్థాలు, స్నాక్స్ వంటివన్నీ మరో కేటగిరీగా విభజించి సర్దుకోవాలి. మసాలా దినుసులు, పప్పులు, రకరకాల పిండిపొడులను మరోచోట ఈజీగా దొరికేలా అమర్చుకోవాలి.

# ఆమెకు తారలే అభిమానులు



కఠోర పరిశ్రమ ఎక్కడుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

**ఆమెకు తారలే అభిమానులు**

కఠోర పరిశ్రమ ఎక్కడుంటుందో విజయం అక్కడే ఉంటుంది. సెలబ్రిటీ ఫిట్‌నెస్ ట్రైనర్ యాస్మిన్ కరాచీవాలా జీవితమే ఇందుకు ఉదాహరణ. ఒకప్పుడు బద్ధకంగా రోజులు వెళ్లదీసిన ఆమె... నిబద్ధతతో కష్టపడి లక్ష్యాన్ని చేరుకుంది. నేడు సామాన్యులకే కాదు... వెండితెర వేల్పులకూ స్ఫూర్తిమంత్రమైంది.

"నా బాల్యం చాలా విచిత్రంగా గడిచిపోయింది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకొంటే నన్ను నేనే నమ్మలేనంతగా మారిపోయింది నా శరీరం... జీవితం. చిన్నప్పుడు నేను చాలా బద్ధకస్తురాలిని. ఆడుకోవడం, తినడం, టీవీ చూడటం, పడుకోవడం ఇదే నా దినచర్య. నా బాల్యమే కాదు, యుక్తవయసు కూడా అలాగే సాగిపోయింది. ఎంత బద్ధకస్తురాలినంటే... కొన్నిసార్లు స్కూల్ నుంచి వచ్చాక యూనిఫామ్ మార్చకుండా పడుకునేదాన్ని. పిజ్జాలు, బిర్యానీలంటే పిచ్చి. బర్గర్లు, నూడుల్స్‌లాంటి ఫాస్ట్ ఫుడ్‌తోనే కడుపు నిండిపోయేది. నన్ను, నా అలవాట్లు చూసి మా అమ్మ ఎంతో ఆందోళన చెందేది. నా బద్ధకం ఎలా వదిలించాలో తెలియక బాధ పడేది. అలాంటి నేను ఇవాళ యాభై నాలుగేళ్ల వయసులోనూ ఇంత ఫిట్‌గా, క్రమశిక్షణగా ఉన్నానంటే ఎదుటివారికే కాదు, నాకూ ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఒక సంకల్పంతో నిబద్ధతగా కష్టపడితే అసాధ్యమైన లక్ష్యం ఏదీ ఉండదనేది నా నమ్మకం. ఆ నమ్మకమే నన్ను మీ ముందు ఇలా నిలబెట్టింది.

**టామ్‌బాయ్‌లా...**

నేను పుట్టింది అమెరికాలో. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. తరువాత ముంబయికి వచ్చాం. సెయింట్ జేవియర్ కాలేజీలో చదివాను. నా స్నేహితుల్లో ఎక్కువ మగపిల్లలు ఉండేవారు. దాని కోసమే అమ్మను అడిగాను... కోఎడ్యుకేషన్ కాలేజీలో చేర్చమని. అప్పుడైతే వారితో కలిసి ఆడుకోవచ్చనేది నా ఉద్దేశం. నాకు నచ్చినట్టు జడ వేయడానికి అమ్మకు గంటకు పైగా పట్టేది. ఒక రోజు విసిగిపోయి సెలూన్‌కు తీసుకువెళ్లి నా జుట్టు కట్ చేయించింది. షార్ట్ హెయిర్‌తో అప్పటి నుంచి నా ఆహార్యం కూడా టామ్‌బాయ్‌లా మారిపోయింది. ఇక కళాశాలలో నేను ఆడినవి రెండే ఆటలు. షార్ట్‌పుట్, జావెలిన్ త్రో. మన బలం చూపించుకొనే క్రీడలు కదా అవి. అందుకే వాటిని ఎంచుకున్నా. టీనేజీలో రెబల్‌గా ఉండేదాన్ని. ఎవరైనా ఇది చేయమని చెబితే నాకు అస్సలు నచ్చేది కాదు.

**స్నేహితురాలితో వెళ్లి...**

నా ఫిట్‌నెస్ ప్రయాణం అనుకోకుండా మొదలైంది. ఒక రోజు నా స్నేహితురాలు మా ఇంటికి వచ్చింది. అప్పటికే తను ఓ అబ్బాయితో ప్రేమలో ఉంది. అందుకే బరువు తగ్గాలని అనుకొంటున్నానని, దాని కోసం జిమ్‌కు వెళ్లాలని, నన్ను తోడు రమ్మని అడిగింది. అప్పుడు నా వయసు పద్దెనిమిదేళ్లు. స్నేహితురాలు అడగడంతో కాదనలేకపోయాను. కొన్నిసార్లు మన జీవితంపై ఎదుటివారి ఒత్తిడి అనేక విధాలుగా పని చేస్తుంది. అయిష్టంగానే తన వెంట జిమ్‌కు వెళ్లి, నేనూ ఫిట్‌నెస్ క్లాస్‌లో చేరాను. ఏరోబిక్స్ సెషన్‌తో నా ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. డ్యాన్స్ మూమెంట్స్‌లా ఉండే ఆ వ్యాయామాలు నాకు బాగా నచ్చాయి. జిమ్‌కు వెళ్లేవరకు అందరు అమ్మాయిల్లా నేనూ బాగా డ్యాన్స్ చేయగలననే నమ్మకం ఉండేది. ఏరోబిక్స్ మొదలుపెట్టాకే తెలిసింది... నాకు అసలు డ్యాన్స్ రాదని. నా కదలికలు మిగిలినవారికి భిన్నంగా ఉండేవి. అందరూ నన్ను వింతగా చూసేవారు. అది నాకు అవమానంగా అనిపించింది. దాంతో పట్టుదల పెరిగింది. ఒక్కరోజు కూడా మానకుండా జిమ్‌కు వెళ్లాను. ఎంతో శ్రమించాను. బాగా మెరుగయ్యాను.

**టీచర్ సలహాతో...**

నాలోని పట్టుదల, నైపుణ్యం చూసిన మా ఏరోబిక్స్ టీచర్... అమెరికాలో ఫిట్‌నెస్ కోర్సు చేయమని చెప్పారు. ఆమె సలహాతో 'అమెరికన్ కాలేజీ ఆఫ్ ఎక్సర్‌సైజ్'లో చేరి, ఫిట్‌నెస్ శిక్షణ తీసుకున్నాను. అలా ఒక ఫిట్‌నెస్ కోర్సులో సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయురాలిని నేనే. అదే సమయంలో కిండర్‌గార్డెన్ టీచర్ ట్రైనింగ్ కూడా తీసుకున్నాను. ముంబయికి తిరిగి వచ్చాక ఫిట్‌నెస్ పాఠాలు మొదలుపెట్టాను. ఉదయం టీచింగ్, సాయంత్రం ఫిట్‌నెస్ క్లాస్‌లు. రోజూ నగరంలో ఈ చివర నుంచి... ఆ చివరకు ప్రయాణం. కొన్ని నెలలు గడిచాయి. 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ స్కూల్'లో ఇంగ్లీష్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. తరువాత మినాజ్ కరాచీవాలతో పెళ్లయింది. మా అబ్బాయి పుట్టాక ఫిట్‌నెస్ తరగతులు కుదించుకున్నా.

**అవహేళన చేసినా...**

మా బాబు కాస్త పెరిగే వరకు నా అవసరం ఉంటుంది కదా. దాని కోసం చాలా అవకాశాలు వదులుకున్నా. కుదిరిన సమయంలోనే శిక్షణ ఇచ్చేదాన్ని. అయితే అందరిలా కాకుండా... నాకంటూ ఒక గుర్తింపు కావాలనిపించింది. దాంతో మరింత నైపుణ్యం పెంచుకొనేందుకు



పర్సనల్ ట్రైనర్ కోర్సు చేశాను. ఆ సమయంలో నా శరీరాకృతిని చూసి 'మగరాయుడిలా ఉంది' అంటూ అవహేళనగా మాట్లాడేవారు. 'నాకంటూ ఒక రోజు వస్తుంది' అని వారికి సమాధానం ఇచ్చేదాన్ని. అందుకే సవాలుగా తీసుకుని ముందు నా శరీరాన్ని నాజూగ్గా తయారు చేసుకున్నా. దీన్ని గమనించిన కొందరు తమకు కూడా అలాంటి ఆకృతి కావాలంటూ అడిగారు. తరువాత వారందరూ నా శిష్యులు అయ్యారు.

**స్టూడియోకు శ్రీకారం...**

ఫిట్‌నెస్ పాఠాల కోసం నా దగ్గరకు వచ్చేవారు క్రమంగా పెరిగారు. దాంతో మా గెస్ట్ రూమ్‌ను ఫిట్‌నెస్ స్టూడియోగా మార్చాను. కొన్నాళ్లకు అది సరిపోక స్టూడియో... లివింగ్ రూమ్‌కు, తరువాత టెర్రస‌కు, అక్కడి నుంచి బాంద్రాలోని పెద్ద హాల్‌కు మారింది. ఇంట్లో నేను తరగతులు చెప్పినంతసేపూ మావారు నాకు తోడుగా ఉండేవారు. ఇంకా ఏదో చేయాలన్న తపనతో అమెరికా వెళ్లి పిలెట్స్ ట్రైనింగ్ తీసుకున్నా. తద్వారా భారత్‌లో తొలి బీఏఎసఐ (బాడీ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఇంటర్నేషనల్) సర్టిఫైడ్ పిలెట్స్ ఇన్‌స్ట్రక్టర్‌ను అయ్యాను.

**తారల ట్రైనర్‌గా...**

ఇక అప్పటి నుంచి నా జీవితమ అనూహ్య మలుపు తీసుకుంది. బాలీవుడ్ తారల నుంచి పిలుపు వచ్చింది. కత్రినా కైఫ్, దీపికా పదుకొనే, కరీనా కపూర్, అలియాభట్... దాదాపు ప్రముఖ హీరోయిన్లు అందరితో కలిసి పని చేశాను. వారికి వ్యక్తిగత ట్రైనర్‌గా కూడా ఉన్నాను. 'యాస్మిన్ బాడీ ఇమేజ్' పేరిట ముంబయిలో అతిపెద్ద పిలెట్స్ స్టూడియో నెలకొల్పాను. దాంతోపాటు నగరంలోనే మరో రెండు, ఢిల్లీ, దుబాయ్, ఢాకాల్లోనూ ఫ్రాంచైజీలు ప్రారంభించాను. రెండున్నర దశాబ్దాలకు పైబడిన నా ఈ ప్రయాణంలో... ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నాను. భారత్‌లో ఫిట్‌నెసను ఒక పరిశ్రమ స్థాయికి తీసుక వెళ్లానని ప్రముఖులు ఎందరో కొనియాడారు. అందుకు ఎంతో గర్వంగా ఉంది."

# లాంగ్ గౌన్లు..క్రాప్ టాప్‌లు!



ప్రపంచం కుగ్రామం అయింది.. ఫ్యాషన్ అంతా ఒక్కటైపోయింది.. అందుకే మనదగ్గర వెస్ట్రన్ వేర్ సర్వసాధారణమైపోయింది.. ఇండోవెస్ట్రన్ ?స్టైల్‌లో ఉండే లాంగ్ గౌన్లు.. కాస్త మోడ్రన్ టచ్‌తో ఉండే లెహంగా, క్రాప్ టాప్‌లు.. ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచాన్ని ఏలుతున్నాయి.. పెళ్ళిళ్ళు, పేరంటాలకు ఇవే సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి..

ఇక్కత్ ఎక్కడున్నా మిమ్మల్ని సెంటరాఫ్ ఎట్రాక్షన్ చేస్తుంది. నల్లని సిల్క్ ఇక్కత్‌ని లాంగ్ గౌన్‌గా కుట్టాం. దీనికి వచ్చిన పెద్ద బార్డర్ హైలైట్‌గా కనిపిస్తున్నది. ఇక పైన ఆరెంజ్ కలర్ ప్యూర్ సిల్క్‌ని జతచేసి దానికి పోట్లీ బటన్స్ ఇచ్చాం. స్లీవ్స్ మీద సీక్వెన్స్, జర్దోసీ వర్క్‌తో నింపేశాం.

ఆకుపచ్చ సిల్క్ క్రాప్ టాప్ ఇది. దీని మీద గోటా పట్టీ, జర్దోసీ వర్క్‌తో నింపేశాం. దీనికి కూడా కోల్డ్ షోల్డర్ అద్దినట్లు ఉంది. ఇక పీచ్ కలర్ ప్యూర్ సిల్క్ లెహంగా మీద ఫుల్‌గా రాజస్థానీ ?స్టైల్‌లో గోటా పట్టీ వర్క్ చేయించాం. పిస్తా గ్రీన్ కలర్ బార్డర్‌ని జత చేసి దాని మీద గోల్డెన్ లేస్ కుట్టడంతో లెహంగా లుక్కే మారిపోయింది.

నీలాకాశంలో మెరిసే తారకలా కనిపించాలంటే ఈ డ్రెస్ వేయాల్సిందే! లైట్ బ్లూ నెట్ ఫ్యాబ్రిక్‌ని లాంగ్ గౌన్‌గా డిజైన్ చేశాం. వెస్ట్రన్ స్టైల్‌లో ఉండేలా ఎక్కువ గేర్‌తో దీన్ని కుట్టాం. నెక్ దగ్గర సీక్వెన్స్, చిప్స్‌తో హెవీగా వర్క్ చేశాం. 3/4 స్లీవ్స్‌తో గౌన్ లుక్కే మారిపోయింది.

ఎండలో వెన్నెల్లా కనిపించేందుకు తెల్లని లాంగ్ గౌన్ పర్‌ఫెక్ట్ ఛాయిస్. తెల్లని ఆర్గంజా మీద ఎర్రని పూల మాదిరి ఆప్లిక్ వర్క్ చేశాం.

డ్రెస్ మొత్తం ఇదే వర్క్ వస్తుంది. బాక్స్ ప్లీట్స్ పెట్టి పైన ఎర్రని లైక్రా ఫ్యాబ్రిక్ అటాచ్ చేశాం. దీనికి హాల్టర్ నెక్ హైలైట్‌గా నిలిచింది.

డార్క్ బ్లూ కలర్ వెల్వెట్‌తో లెహంగా కుట్టాం. దాని మీద మొత్తం జరీ వర్క్‌తో నింపేశాం. గోల్డెన్ జరీ వచ్చిన లేస్‌ని బార్డర్‌గా జతచేశాం. ఇక క్రాప్‌టాప్‌కి పింక్ కలర్ ప్యూర్ సిల్క్ ఎంచుకున్నాం. దీని మీద కుందన్స్, జర్దోసీ, ముత్యాలతో హెవీగా వర్క్ చేశాం. కోల్డ్ షోల్డర్, ఫుల్‌స్లీవ్స్‌తో రాజకుమారిని తలపింపొచ్చు. స్లీవ్స్ మీద గ్లాస్ ట్యూబ్స్‌తో వర్క్ చేశాం.



# తల్లులు ఊబకాయులైతే..

ఊబకాయంతో ఉండే తల్లులకు పుట్టే పిల్లల్లో రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుందని ఇటీవల చేసిన ఒక స్టడీలో వెల్లడైంది. అదే సమయంలో లావుగా లేని అమ్మలకు పుట్టిన బిడ్డల్లో మాత్రం ఈ లోపం కనిపించడంలేదని అధ్యయనకారులు పేర్కొన్నారు. తల్లి కావడానికి ముందర ఆడవాళ్లు భారీకాయంతో ఉంటే దాని ప్రభావం వాళ్లకి పుట్టే బిడ్డల్లో కనిపిస్తుందట. గుండెజబ్బులు, ఆస్తమా వంటి జబ్బుల బారిన పడే అవకాశం ఉందని ఈ స్టడీని నిర్వహించిన కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఇహెమ్ మెసాద్ తెలిపారు.

ఈ స్టడీలో ప్రధానంగా ఊబకాయులైన తల్లులకు పుట్టిన పిల్లల్లో రోగనిరోధకశక్తిపై, వారికి వచ్చే జబ్బులపై రీసెర్చ్ చేశారు. ఈ స్టడీ అమెరికాలోని 39 మంది తల్లులపై చేశారు. లావుగా ఉన్న తల్లులకు, సన్నగా ఉన్న తల్లులకు పుట్టిన పిల్లల బొడ్డుతాడు నుంచి కణాలు తీసి పరీక్షించారు. అందులో ఊబకాయులైన తల్లులకు పుట్టిన బిడ్డలు బాక్టీరియల్ యాంటిజన్స్‌కు సరిగా స్పందించడం లేదు. కానీ సన్నగా ఉన్న తల్లులకు పుట్టిన బిడ్డల్లో బాక్టీరియల్ యాంటిజెన్స్‌కు స్పందన బాగా ఉండడాన్ని గుర్తించారు. ఊబకాయంతో ఉన్న తల్లులకు పుట్టిన పిల్లల్లో మనిషి రోగనిరోధక వ్యవస్థలో ముఖ్యమైన సిడి4టి కౌంట్ తగ్గడం గమనించారు. ఆస్తమా, ఇతర రకాల ఎలర్జీల నివారణలో ముఖ్యపాత్ర వహించే రోగనిరోధక కణాల సంఖ్య ఊబకాయమున్న తల్లులకు పుట్టిన పిల్లల బొడ్డుతాడులో తక్కువగా ఉండడాన్ని కూడా ఈ అధ్యయనంలో గుర్తించారు.

# ఒత్తిడిని అధిగమించేందుకు మార్గాలున్నాయ్

ఈ రోజులలో ఒత్తిడికి గురికాకుండా ఎవరైనా ఉన్నారా అంటే... లేరనే చెప్పాలి. కాలంతోపాటు పరిగెత్తే క్రమంలో ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడిని జయించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఒత్తిడిని అధిగమించడంపై పుస్తకాలు, టీవీలలో ప్రసారాలు, పత్రికలలో ప్రత్యేక కథనాలు కూడా వస్తుంటాయి. కౌన్సెలింగ్ తరగతులు కూడా కొందరు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా యోగా సెంటర్లు స్ట్రెస్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయి. ఇంటర్నేషనల్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన ఒత్తిడి నుంచి అధిగమించడానికి ఏమేమి చేయాలన్నదానిపై కొన్ని సూచనలు ఇస్తోంది. ఒత్తిడి ఎవరెవరిలో ఉంటుంది? వ్యవసాయదారులు పంటలు పండకపోతే, తెచ్చిన రుణం తీరకపోతే, చేతికొచ్చిన పంట ఎండిపోతే, తుపానుకు తుడిచి పెట్టుకుపోతే, తగిన ధర రాకపోతే ఒత్తిడికి గురవుతారు. 40 నుంచి 50 శాతం మంది రైతులలో ఒత్తిడి ఉంటుందని అంచనా. గృహిణులు కూడా ఒత్తిడికి గురవుతారట. ఉదయం నిద్ర లేచినప్పటినుంచి వారు చేసే పని అంతా కూడా ఒత్తిడితోనే ఉంటుంది. ఉద్యోగాలకు వెళ్ళేవారయితే పిల్లలను పాఠశాలలకు వెళ్ళేందుకు సిద్ధం చేయడం ఒక ఎత్తయితే, వారు ఉద్యోగానికి సమయానికి చేరుకోవడం కూడా మరొక ఎత్తు. గృహిణులలో 40 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. ఉపాధ్యాయులు, ఉద్యోగులుకు సంబంధించి 20 నుంచి 30 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. రాజకీయనాయకులలో సుమారు 50 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. రాజకీయ నాయకులు పదవుల కోసం. ఎన్నికలలో గెలుపుకోసం. మంత్రి పదవులకోసం వంటి స్వీయపనుల కోసం ఒక ఒత్తిడి అయితే. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేక ఇబ్బందులు పడుతూ ఒత్తిడి గురవడం ఇంకొకటి. పోలీసులలో 60 శాతం మందికి ఒత్తిడి ఉంటుందని అంచనా. సొంత వ్యాపారాలు చేసే వారికి మరింతగా ఒత్తిడి ఉంటుంది. దాదాపు 70 శాతంమంది ఒత్తిడికి గురవుతారట. పోటీని తట్టుకుని వ్యాపారం చేయడంలో, లాభాలను ఆర్జించడంలో, తెచ్చిన రుణాలను తీర్చక ఇబ్బంది పడుతున్న సమయంలో ఒత్తిడికి గురవుతారట. ఎగ్జిక్యూటివ్‌లు తమకు ఇచ్చిన లక్ష్యాలను నెరవేర్చలేక ఒత్తిడికి గురవుతుంటారు. విద్యార్థులు కూడా పోటీపరీక్షలలో పాల్గొనేందుకు, రెగ్యులర్ పరీక్షలలో బెస్ట్ ర్యాంక్ తెచ్చుకునేందుకు ఇలా పలు రకాల ఒత్తిడిలు వారిపై కూడా ఉంటాయి. శ్వాసకోస వ్యాధులు, అజీర్ణవ్యాధులు, కడుపునొప్పి, చర్మవ్యాధులు, బ్లడ్ ప్రెషర్, మధుమేహం, నిద్రపట్టకపోవడం, గుండెల్లో దడ, మైగ్రేన ఇలాంటి కొన్ని వ్యాధుల కారణంగా కూడా ఒత్తిడి ఉంటుంది. అలసట, అనారోగ్యసమస్యలు, సంసారం సరిగా సాగనప్పుడు, ఈర్ష్యా ద్వేషాలు ఉన్నపుడు, భయం అవహించి ఉండడం, విపరీతమైన భ్రాంతితో ఉండడం ఇలా ఎన్నో ఎన్నెన్నో... ఒత్తిడినుంచి అధిగమించేందుకు... విశ్రాంతి తీసుకోవాలి. ఎంత సమయం పాటు విశ్రాంతి తీసుకోవాలన్నదానిపై కొలమానం ఏదీ లేదు. మనస్సు ఆహ్లాదకరంగా ఉందనిపించేంత వరకు విశ్రాంతి తీసుకోవచ్చు. యోగా చేయవచ్చు, ప్రకృతి సుందర ప్రదేశాలు, దేవాలయాలను దర్శించవచ్చు. పర్యటనలకు వెళ్ళవచ్చు. ముఖ్యంగా ఒత్తిడిని జయించేందుకు ఆత్మవిశ్వాసం చాలా ముఖ్యం. ఒత్తిడీ ఒక మేలే.. నిజంగా ఒత్తిడీ ఒకమేలేనని చెబుతారు. ఒత్తిడి నుంచి ఉత్తేజితులవ్వాలి. ముఖ్యంగా చదువుకునే విద్యార్థి నుంచి దేశాధినేత వరకు అందరిలోనూ ఒత్తిడి ఉంటోంది. ముఖ్యంగా మేనేజ్‌మెంట్ చేసే వాళ్ళకు ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. ఒత్తిడి అనేది లేకపోతే కొందరు బద్ధకస్తులు అవుతారు. పనిని తొందరగా చేయాలని అనిపించడమే ఒత్తిడి.

ఏం చేయాలి? ..ఇప్పుడు ఎంత పని చేయగలమో అంతే చేయాలి. రేపటి గురించి తరువాత ఆలోచన చేయాలి. సమస్యలను ఎదుర్కొనడానికి సిద్దపడాలి. కష్టంవస్తే కుంగి పోకూడదు. ఖాళీగా ఉన్న సమయంలో ఒత్తిడిని అధిగమించేందుకు ప్రయత్నాలు చేయాలి. పుస్తక పఠనం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుంది. ఆత్మీయుల వద్దకు వెళ్ళి కాసేపు మాట్లాడితే ,ఇష్టమైన ప్రాంతానికి పర్యటనకు వెళితేకూడా ఉపశమనం ఉంటుంది. పదిమందిలో కాసేపు కూర్చుని సరదాగా మాట్లాడండి.

## మరోసారి కొత్త రికార్డులకు చేరిన సూచీలు.. 86వేలకు చేరువైన సెన్సెక్స్



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాల్లో ముగిశాయి. ఇటీవల సరికొత్త రికార్డులను సృష్టిస్తున్న బెంచ్ మార్క్ సూచీలు మరోసారి కొత్త రికార్డులను నమోదు చేశాయి. సూచీలు ఉదయం ఫ్లాట్‌గా మొదలయ్యాయి. చివరి సెషన్‌లో ఆటో, మెటల్ షేర్ల మద్దతుతో జీవితకాల గరిష్ఠాలను తాకాయి. క్రితం పోలిస్తే సెన్సెక్స్ గురువారం ఉదయం 85,167.56 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఇంట్రాడేలో 85,106.74 పాయింట్ల కనిష్ఠానికి తగ్గిన సెన్సెక్స్.. 85,930.43 పాయింట్ల గరిష్ఠానికి చేరి 86వేల పాయింట్లకు చేరువైంది. చివరకు 666.25 పాయింట్ల లాభంతో 85,836.12 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం లాభాల బాటలో కొనసాగింది. ఇంట్రాడేలో 26,250.90 పాయింట్లకు చేరి ఆల్ టైమ్ రికార్డు హైకి చేరింది. చివరకు 211.90 పాయింట్ల లాభంతో.. 26,216.05 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీలో మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్ లాభాల్లో కొనసాగగా.. ఓఎన్‌జీసీ, సిప్లా, దివిస్ ల్యాబ్స్, హీరో మోటోకార్ప్, ఎల్అండ్‌టీ నష్టపోయాయి. సెక్టార్లలో మెటల్, ఆటో 2 శాతం చొప్పున, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు ఒకశాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. క్యాపిటల్ గూడ్స్ ఇండెక్స్ 0.5 శాతం పతనమైంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం దిగజారింది.




## అక్టోబర్‌లో బ్యాంకులకు 11 రోజులు సెలవు




**న్యూఢిల్లీ-నవభూమి:** టెక్నాలజీ పెరిగింది. ఆర్థిక లావాదేవీలన్నీ అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్‌లోనే పూర్తి చేస్తున్నారు ప్రజలు. డబ్బులు పంపాలన్నా.. డబ్బులు పొందాలన్నా.. యూపీఐ పేమెంట్స్‌తో నిమిషాల్లో పని పూర్తైపోతుంది. అయినప్పటికీ.. కొన్ని సందర్భాల్లో వ్యక్తులు తమ పనుల కోసం బ్యాంకులకు తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తుంది. హోమ్ లోన్ గానీ, హౌస్ లోన్ గానీ తీసుకోవాలనుకుంటే.. తప్పనిసరిగా బ్యాంకు వద్దకు వెళ్లాల్సివస్తుంది. అలాగే.. అకౌంట్ ఓపెన్ చేసేవారు ఆన్‌లైన్‌లో ఓపెన్ చేసినప్పటికీ.. పాస్ బుక్, చెక్ బుక్, ఏటీఎం కార్డు కావాలంటే తప్పనిసరిగా బ్యాంకు వద్దకు వెళ్లాల్సిందే.మొత్తంగా ఏ రకంగా చూసినా.. కొన్ని కొన్ని పనుల కోసం తప్పనిసరిగా బ్యాంకు వద్దకు వెళ్లాల్సి వస్తుంది. అయితే, అక్టోబర్ నెలలో బ్యాంకులకు భారీగా సెలవులు వచ్చాయి. ఈ సెలవు రోజుల్లో మీకు బ్యాంకు పనులు అత్యవసరమైతే.. ఏం చేయలేని పరిస్థితి ఉంటుంది. అందుకే.. అక్టోబర్ నెలలో ఏయే రోజుల్లో సెలవులు ఉంటాయో ముందుగానే మీ దృష్టికి తీసుకువస్తున్నాం. బ్యాంకింగ్ వర్గాల అధికారిక సమాచారం ప్రకారం

**అక్టోబర్‌లో బ్యాంక్ హాలిడేస్ ఇవే..**

అక్టోబర్ నెలలో బ్యాంకులకు మొత్తం 11 రోజులు హాలిడేస్ వచ్చాయి. 2వ తేదీ.. 3, 6, 10, 11, 12, 13, 17, 20, 26, 27, 31 రోజుల్లో సెలవులు ఉండనున్నాయి. మరి ఈ సెలవులు ఎందుకు? కారణాలేంటి అనే వివరాలు కూడా తెలుసుకుందాం. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి ఉంటుంది. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా బ్యాంకులు బంద్ ఉంటాయి. అక్టోబర్ 2వ తేదీన శారదీయ నవరాత్రులు, మహారాజా అగ్రసేన్ జయంతి సందర్భంగా అక్టోబర్ 3వ తేదీన కూడా బ్యాంక్ హాలిడే ఉంటుంది. అక్టోబర్ 6వ తేదీన ఆదివారం కావడంతో దేశ వ్యాప్తంగా బ్యాంకులకు సెలవు.అక్టోబర్ 10వ తేదీన మహా సప్తమి కారణంగా దేశ వ్యాప్తంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది. మహానవమి కారణంగా అక్టోబర్ 11న కూడా బ్యాంకులకు హాలిడే ఉంటుంది. ఆయుధపూజ, దసరా, రెండో శనివారం కారణంగా అక్టోబర్ 12న దేశ వ్యాప్తంగా బ్యాంకులకు సెలవు ఉంటుంది. అక్టోబర్ 13వ తేదీన ఆదివారం సందర్భంగా బ్యాంకులన్నీ బంద్ ఉంటాయి. 17వ తేదీన కాటి బిహు సందర్భంగా అస్సాం రాష్ట్రంలో మాత్రమే బ్యాంకులకు సెలవు ఉంటుంది. అలాగే, ఈ రోజున వాల్మీకి జయంతి కారణంగా చాలా రాష్ట్రాల్లోనూ బ్యాంకులకు సెలవు ఉంటుంది. అక్టోబర్ 20వ తేదీ ఆదివారం కారణంగా బంద్ ఉంటాయి.అక్టోబర్ 26వ తేదీన నాలుగో శనివారం కారణంగా బ్యాంకులు బంద్ ఉంటాయి. 27వ తేదీన ఆదివారం కావడంతో ఆ రోజునా బ్యాంకులకు సెలవు ఉంటుంది. అక్టోబర్ 31వ తేదీన నరక చతుర్ధశి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా బ్యాంకులకు హాలిడే ఉంటుంది.

## జియో యూజర్లకు గుడ్‌న్యూస్.. మరో కొత్త ప్లాన్ ప్రవేశపెట్టిన టెలికం దిగ్గజం

**న్యూఢిల్లీ- నవభూమి:** తన కస్టమర్లు పక్క కంపెనీల వైపు చూడకుండా సరికొత్త సరసమైన రీఛార్జ్ ప్లాన్‌లను రిలయన్స్ జియో ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో రోజుకు సగటున రూ.10 వెచ్చించి 98 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 2జీబీ డేటా, అపరిమిత కాలింగ్‌తో అదిరిపోయే ఆఫర్‌ను కంపెనీ ప్రకటించింది. ఈ ప్లాన్‌కు సంబంధించిన వివరాలను మీరూ తెలుసుకోండి.

భారత టెలికం దిగ్గజం రిలయన్స్ జియోతో పాటు ఇతర ప్రైవేట్ టెలికం ఆపరేటర్లు అయిన భారతీ ఎయిర్‌టెల్, వీ (వొడాఐడియా) జులై నెలలో రీఛార్జ్ రేట్లను గణనీయంగా పెంచాయి. ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్ రీఛార్జులు రెండింటినీ దాదాపు 15 శాతం వరకు పెంచాయి. టారిఫ్ రేట్లను గణనీయంగా పెంచడంతో చాలా మంది వినియోగదారులు ప్రభుత్వరంగ టెలికం ఆపరేటర్ అయిన బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గుచూపారు.

ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకున్న జియో తన కస్టమర్లను నిలుపుదల చేసుకునేందుకు సరికొత్త సరసమైన రీఛార్జ్ ప్లాన్లను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో రోజుకు సగటున రూ.10కి సమాన ఖర్చుతో 98 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 2జీబీ డేటా, అపరిమిత కాలింగ్ వంటి సౌకర్యాలతో అదిరిపోయే ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ప్లాన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మీరూ తెలుసుకోండి.

**రూ.999 రీఛార్జ్ ప్లాన్ వివరాలు ఇవే..**

ఈ రీఛార్జ్ ప్లాన్ వ్యాలిడిటీ 98 రోజులుగా ఉంది. రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లతోపాటు అపరిమిత కాలింగ్ చేసుకోవచ్చు. 2 జీబీ రోజువారీ డేటా కూడా లభిస్తుంది. అంతేకాదు 5జీ ఇంటర్నెట్ యాక్సెస్ ఉన్న ప్రాంతాల్లోనివారు అపరిమిత 5జీ డేటాను వాడుకోవచ్చు. జియోటీవీ, జియోక్లౌడ్, జియో సినిమా వంటి కాంప్లిమెంటరీ సబ్‌స్క్రిప్షన్‌లను కూడా వినియోగదారులు పొందవచ్చు.భారతీ ఎయిర్‌టెల్ కూడా ఇటీవల కొన్ని కొత్త రీఛార్జ్ ప్లాన్లను ప్రకటించింది. రూ.161, రూ.181, రూ.361 ప్లాన్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇవన్నీ అదనపు డేటా ప్యాక్‌లు. 30 రోజుల వ్యాలిడిటీతో వీటిని కంపెనీ ఆవిష్కరించింది.

# తులం రూ.77,850.. ఆల్‌టైమ్ హైకి బంగారం ధరలు



**న్యూఢిల్లీ- నవభూమి:** బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి చేరాయి. బుధవారం మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు దేశ రాజధాని నగరం ఢిల్లీలో రూ.77,850 పలికింది. మంగళవా రం ముగింపుతో చూస్తే ఒక్కరోజే రూ.900 ఎగిసింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం రేటూ రూ.900 ఎగబాకి రూ.77, 500గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధరల్లో కొనసాగుతున్న ర్యాలీనే ఇందుకు కారణమని అఖిల భారత సరఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్‌లోనూ 24 క్యారెట్ పుత్తడి 10 గ్రాములు రూ. 660 పుంజుకొని రూ.77,020గా ఉన్నది.

**వెండీ రేట్లూ పైపైకే**

బంగారానికితోడు వెండి ధరలూ పరుగులు పెడుతున్నాయి. ఢిల్లీలో ఒక్కరోజే కిలో రేటు రూ.3,000 ఎగిసి రూ.93,000ను తాకింది. పారిశ్రామిక రంగం, నాణేల తయారీదారులు, సాధారణ కొనుగోలుదారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వ్యక్తమవుతున్నట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. ఇక హైదరాబాద్‌లోనూ కిలో వెండి ధర బుధవారం రూ.3,000 పెరిగింది. దీంతో రూ.97,000 నుంచి లక్ష రూపాయలపైనే పలుకుతున్నట్టు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఫ్యూచర్ మార్కెట్‌లో కూడా గోల్డ్ బుల్ రన్ సాగుతున్నది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఎంసీఎక్స్‌పై అక్టోబర్ గోల్డ్ కాంట్రాక్ట్స్ 10 గ్రాము లు రూ.76,000 పలికింది. ఇక డిసెంబర్ నెలకుగాను సిల్వర్ కాం ట్రాక్ట్స్ కిలో రూ.91,974గా ఉన్నది.

**గ్లోబల్ మార్కెట్‌లో..**

గోల్డ్, సిల్వర్ రేట్లు గ్లోబల్ మార్కెట్‌లో దూసుకుపోతున్నాయి. ఔన్స్ గోల్డ్ ధర 2,681.10 డాలర్లకు చేరింది. ఒకానొక దశ లో రికార్డు స్థాయిలో 2,694.89 డాలర్లు పలకడం విశేషం. వెండి రేటు ఔన్స్ 32.15 డాలర్లుగా ఉన్నది. కాగా, బంగారం ధరలు అంతర్జాతీయ విపణిలో ఔన్స్ 3,200 డాలర్లను తా కే వీలున్నట్టు భారతీయ బులియన్, జ్యుయెల్లర్ల సంఘం (ఐబీజేఏ) కార్యదర్శి సురేంద్ర మెహెతా అంటున్నారు. ఈ అంచనాతో దేశీయ మార్కెట్‌లో పసిడి ధరల పరుగు ఇకపైనా కొనసాగుతుందని స్పష్టమవుతున్నది.

**పండుగ సీజన్‌ జోష్**

రాబోయేది పండుగ సీజన్ కావడంతో బంగారం, వెండి ధరలు ఇంకా పెరుగుతాయన్న అంచనాలు మార్కెట్‌లో బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దీపావళికి కొత్త రికార్డులు నమోదవడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లు ఆల్‌టైమ్ హైల్లో ఉండటంతో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం పసిడి వైపునకు కొంతమేర ఇన్వెస్ట్‌మెంట్లు తరలిస్తున్నారని, దీంతో ఒకవేళ మార్కెట్ క్రాష్ అయితే పుత్తడి రేట్లు మరింత పెరుగవచ్చన్న అంచనాలూ ఉన్నాయి. ఇక నగల వర్తకులు నిరంతరం బంగారం కొనుగోళ్లకు దిగుతుండటం కూడా డిమాండ్‌ను పెంచి మార్కెట్‌లో ధరల్ని పెంచుతున్నాయని ట్రేడర్లు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు.




## "సుగమ్ రిన్ భుగ్తాన్ యోజన "ను ప్రారంభించిన ఐడీబీఐ బ్యాంక్

IDBI BANK

**న్యూఢిల్లీ-** ఐడీబీఐ బ్యాంక్ "సుగమ్ రిన్ భుగ్తాన్ యోజన అనే ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. ఇది మార్చి 31, 2021 వరకు రిటైల్ నికర నిరర్థక ఆస్తుల ను ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా దాని రికవరీ ప్రయత్నాలను పెంచేందుకు, రుణగ్రహీత ప్రిన్సిపల్ రూ.0.10 కోట్ల కన్నా ఎక్కువ మరియు రూ.10 కోట్ల వరకు (అర్హత ప్రమాణాలకు లోబడి) ఉంటుంది. కష్టాల్లో ఉన్న రుణగ్రహీతలకు పునరుద్ధరించబడిన అవకాశాన్ని అందించేందుకు మరియు చట్టపరమైన చిక్కులను నివారించేందుకు, వారి బకాయిలను తీర్చేందుకు సిద్ధంగా ఉన్న నిబంధనలకు అనుగుణంగా ఈ పథకం సహకారాన్ని అందిస్తుంది. పథకానికి సంబంధించిన సంక్షిప్త సమాచారం https://www.idbibank.in/idbi-bank-sugam-rinn-bhugtan-yojana.aspx లో అందుబాటులో ఉంది.

## ఎలక్ట్రిక్ ఎల్‌సీవీ విభాగంలోకి యూలర్

**న్యూఢిల్లీ- నవభూమి:** ఎలక్ట్రిక్ వాహన తయారీ దారు యూలర్ మోటార్స్.. తేలికపాటి వాణిజ్య వాహన (ఎల్‌సీవీ) విభాగంలోకి ప్రవేశించింది. వివిధ వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా నాలుగు టైర్లతో కూడిన రెండు ఎలక్ట్రిక్ ఎల్‌సీవీలను మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుతం కంపెనీ ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలను విక్రయిస్తోందని, తాజాగా ఇంటర్, ఇంట్రా సిటీ అవసరాల కోసం స్టార్మ్ పేరుతో ఈ వాహనాలను తీసుకువచ్చినట్లు యూలర్ మోటార్స్ వ్యవస్థాప కుడు, సీఈఓ సౌరవ్ కుమార్ తెలిపారు. ఇంట్రా సిటీ కోసం స్టార్మ్ ఈవీ టీ1250 పేరుతో తీసుకు వచ్చిన ఎల్‌సీవీ ధర రూ.8.99 లక్షలు (ఎక్స్‌షో రూమ్). 1,250 కేజీల పేలోడ్ సామర్థ్యంతో కూడిన ఈ వాహనం ఒకసారి చార్జింగ్‌తో 140 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.

# గూగుల్ పిక్సెల్ 9 ఫోన్లపై ఫ్లిప్‌కార్ట్ భారీ డిస్కౌంట్లు



**న్యూఢిల్లీ- నవభూమి:** గ్లోబల్ టెక్ కంపెనీ గూగుల్ తన గూగుల్ పిక్సెల్ 9 ఫోన్‌ను టెన్సార్ జీ4 ఎస్వోసీ, టైటాన్ ఎం2 సెక్యూరిటీ కో ప్రాసెసర్‌తో గత ఆగస్టులో ఆవిష్కరించింది. ఇప్పుడు ఈ ఫోన్ ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌లో భాగంగా డిస్కౌంట్ ధరపై అందుబాటులో ఉంది. నో-కాస్ట్ ఈఎంఐ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తుందీ ఈ-కామర్స్ ప్లాట్ ఫామ్. 45వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 4700 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తోంది.

గూగుల్ పిక్సెల్ 9 ఫోన్ 12 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.79,999లకు మార్కెట్లో ఆవిష్కరించింది గూగుల్. ఐసీఐసీఐ క్రెడిట్ కార్డులు, ఫ్లిప్ కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులపై రూ.4,000 క్యాష్ బ్యాక్ ఆఫర్ చేస్తుంది. ఈఎంఐ ట్రాన్సాక్షన్లను అనుమతి ఇస్తుంది. దీంతో ఫోన్ ధర రూ.75,999 పలుకుతుంది. ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద పాత ఫోన్ పనితీరును బట్టి రూ.70 వేల లోపు ధరకు అందుబాటులో ఉంటుంది. ఇంతకుముందు గూగుల్ పిక్సెల్ 9 ఫోన్ ధర రూ.64,999లకు లభిస్తుందని ఫ్లిప్ కార్ట్ వెల్లడించింది.

నెలకు రూ.13,334తో నో -కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ ప్రారంభం అవుతుంది. స్క్రీన్ గార్డులు, కేస్‌ల కోసం ఫ్లిప్ కార్ట్ అదనంగా 15 శాతం కాంబో ఆఫర్ అందిస్తుంది. దీంతోపాటు గూగుల్ పిక్సెల్ 9 ప్రో ఎక్స్ఎల్ , గూగుల్ పిక్సెల్ 9 ప్రో ఫోల్డ్ ఫోన్లపైనా ఫ్లిప్ కార్ట్ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తోంది. గూగుల్ పిక్సెల్ 9 ఫోన్ కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్రొటెక్షన్ తోపాటు 6.3 అంగుళాల (1080ఐ2424 పిక్సెల్స్) యాక్చువా ఓలెడ్ డిస్ ప్లే కలిగి ఉంటుంది. టెన్సార్ జీ4 ఎస్వోసీ, టైటాన్ ఎం2 సెక్యూరిటీ కో ప్రాసెసర్లతో పని చేస్తుంది. డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ ఉంటుంది. 50-మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సర్ కెమెరా, 48-మెగా పిక్సెల్ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంటాయి. 45వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్, క్యూఐ సర్టిఫైడ్ వైర్ లెస్ చార్జింగ్ మద్దతుతోపాటు 47000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ ఉంటుంది.

## శాంసంగ్ నుంచి మరో బడ్జెట్ ఫ్రెండ్లీ ఫోన్ గెలాక్సీ ఎం15 5జీ.. ఇవీ డిటెయిల్స్..!



**న్యూఢిల్లీ- నవభూమి:** దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్ మేజర్ శాంసంగ్ నుంచి మరో బడ్జెట్ ఫ్రెండ్లీ స్మార్ట్ ఫోన్ వచ్చింది. శాంసంగ్ గెలాక్సీ ఎం15 5జీ ప్రైమ్ ఫోన్‌ను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. గత ఏప్రిల్ ఆవిష్కరించిన శాంసంగ్ గెలాక్సీ ఎం15 5జీ ఫోన్ మాదిరిగానే ఉంటుందీ ఫోన్. మీడియాటెక్ డైమెన్సిటీ 6100 ం ప్రాసెసర్ తో పని చేస్తుంది. 8 జీబీ ర్యామ్, 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో ఉంటుంది. 50-మెగా పిక్సెల్ ట్రిపుల్ రేర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 13-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. ఆండ్రాయిడ్ 14 ఓఎస్ వర్షన్ పై పని చేస్తుంది. నాలుగేండ్ల పాటు ఓఎస్ అప్ డేట్స్ అందిస్తుంది.శాంసంగ్ గెలాక్సీ ఎం15 5జీ ప్రైమ్ ఎడిషన్ ఫోన్ 4 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.10,999, 6 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.11,499, 8 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.13,499 పలుకుతుంది. అమెజాన్, శాంసంగ్ ఇండియా వెబ్ సైట్లలో ఈ ఫోన్లు లభిస్తాయి. బ్లూ టోపాజ్, సెలెస్టియల్ బ్లూ, స్టోన్ గ్రే కలర్ ఆప్షన్లతో అందుబాటులో ఉంది.శాంసంగ్ గెలాక్సీ ఎం15 5జీ ప్రైమ్ ఎడిషన్ ఫోన్ 90 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.5 అంగుళాల ఫుల్ హెచ్డీం (1080ఐ2340 పిక్సెల్స్) సూపర్ అమోలెడ్ డిస్ ప్లే కలిగి ఉంటుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6100ం ప్రాసెసర్ తో పనిచేస్తుంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ వన్ యూఐ 6.0 వర్షన్ పై పని చేస్తుంది. నాలుగేండ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఐదేండ్ల పాటు సెక్యూరిటీ అప్ డేట్స్ అందిస్తామని శాంసంగ్ వెల్లడించింది. 50-మెగా పిక్సెల్ ప్రైమరీ సెన్సర్ కెమెరా, 5-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా, 2-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 13 మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి.వాయిస్ కాల్ క్లారిటీ కోసం 'నాక్స్ సెక్యూరిటీ, క్విక్ షేర్ ఫీచర్స్, వాయిస్ ఫోకస్' వంటి ఫీచర్లతో వస్తోంది.

## వయాకాం18లో డైరెక్టర్లుగా నీతా.. ఆకాశ్ అంబానీ.. ఎందుకంటే..?!



**న్యూఢిల్లీ- నవభూమి:** రిలయన్స్ ఫౌండేషన్ చైర్ పర్సన్ నీతా అంబానీ, రిలయన్స్ జియో ఇన్ఫోకాం చైర్మన్ ఆకాశ్ అంబానీలు.. రిలయన్స్ - బోధి ట్రీ సిస్టమ్స్ యాజమాన్యంలోని వయాకాం18 బోర్డు డైరెక్టర్లుగా చేరారు. దేశంలోనే ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థగా వెలుగొందుతున్న వయాకాం 18, మరో వినోద రంగ సంస్థ వాల్ట్ డిస్నీ స్టార్ ఇండియా విలీనం ప్రక్రియ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో వయాకాం 18 డైరెక్టర్లుగా నీతా అంబానీ, ఆకాశ్ అంబానీ చేరడం ప్రాధాన్యం సంతరించుకున్నది. రెండు సంస్థల సమగ్రతను పెంపొందించేందుకు వయాకాం 18 డైరెక్టర్ల బోర్డును పునర్వ్యవస్థీకరించారు. అంబానీలతో పాటు వయాకాం18 బోర్డు డైరెక్టర్లుగా బోధి ట్రీ సిస్టమ్స్ కో-ఫౌండర్ జేమ్స్ ముర్డోక్, బోధి ట్రీ లో ప్రధాన ఇన్వెస్టర్ సంస్థ ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) మహ్మద్ అల్ హర్దాన్‌లను బోర్డు డైరెక్టర్లుగా నియమించారు. వీరితోపాటు రిలయన్స్ మీడియా అండ్ కంటెట్ బిజినెస్ ప్రెసిడెంట్ జ్యోతి దేశ్ పాండే, అనగ్రామ్ పార్టనర్స్ పార్టనర్ శువ మండల్ కూడా వయాకాం 18లో బోర్డు డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

మార్చి 31 నాటికి వయాకాం18లో ఆరుగురు డైరెక్టర్లు %-% అదిల్ జైనుల్ భాయ్, ఉదయ్ శంకర్, మధుసూదన శివ ప్రసాద్ పాండా, రాహుల్ జోషి, అలెగ్జాండర్ బెర్కెట్, ప్రియాంక చౌదరి ఉన్నారు.వయాకాం18లో తన 13 శాతం వాటాను పారామౌంట్ గ్లోబల్ రూ.4,286 కోట్లకు రియలన్స్‌కు విక్రయించడంతో అలెగ్జాండర్ బెర్కెట్ బోర్డు నుంచి నిష్క్రమిస్తారని సమాచారం. ఇక స్టార్ ఇండియా నుంచి నలుగురు డైరెక్టర్లు %-% అతుల్ అగర్వాల్, రిషి కన్వర్ జీత్ గైండ్, గౌరవ్ బెనర్జీ, గుర్జీవ్ సింగ్ కపూర్ ఉన్నారు. ప్రస్తుతం సోనీ పిక్చర్స్ నెట్ వర్క్ ఇండియా ఎండీ కం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా గౌరవ్ బెనర్జీ వ్యవహరిస్తున్నారు.

రెండు సంస్థల మధ్య విలీనం పూర్తయిన తర్వాత స్టార్ ఇండియా, వయాకాం18 ప్రతినిధులతో కొత్త బోర్డు ఏర్పాటవుతుంది. ఉమ్మడి సంస్థలో ఆరుగురిని రిలయన్స్, వాల్ట్ డిస్నీ ముగ్గురిని, బోధి ట్రీ ఒకరిని నామినేట్ చేస్తాయి. ఇప్పటికే వయాకాం18 యాజమాన్యం తన టీవీ చానెల్ లైసెన్సులను స్టార్ ఇండియాకు బదిలీ చేస్తూ కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ అనుమతి కోసం దరఖాస్తు చేసింది. రెండు సంస్థల విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ), కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపాయి. రెండు సంస్థల విలీనం తర్వాత ఏర్పాటయ్యే ఉమ్మడి సంస్థ మార్కెట్ విలువ 8.5 బిలియన్ డాలర్లు ఉంటుందని సమాచారం.

# నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

7 | హైదరాబాద్ | శుక్రవారం | 27 । సెప్టెంబర్ । 2024






## 53 ఔషధాల్లో నాణ్యతా లోపాలు

**న్యూఢిల్లీ- నవభూమి:** పారాసిటమాల్, కాల్షియం, విటమిన్ సీ, డీ3, యాంటీ బయాటిక్, మధుమేహం, రక్తపోటు (బీపీ) టాబ్లెట్లు సహా 53 రకాల ఔషధాలు నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయి. భారత ఔషధ రంగ నియంత్రణ మండలి (సీడీఎస్‌సీవో) ఈ ఔషధాలను నాణ్యతా ప్రమాణాలు లోపించిన ఔషధాల జాబితాలో చేర్చింది. హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్, ఆల్కెమ్ ల్యాబొరేటరీస్, హిందుస్థాన్ యాంటీబయాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్), కర్ణాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్, మెగ్ లైఫ్ సైన్సెస్, ప్యూర్ అండ్ క్యూర్ హెల్త్‌కేర్ తదితర కంపెనీలు ఈ నాసిరకం ఔషధాలను తయారు చేశాయని నియంత్రణ మండలి తన నివేదికలో తెలిపింది. సీడీఎస్‌సీవో మార్కెట్లో విక్రయిస్తున్న ఔషధాల శాంపిళ్లను సేకరించి పరీక్షలను నిర్వహిస్తుంటుంది. ఈ 53 ఔషధాల్లో విటమిన్ సీ, డీ 3 టాబ్లెట్ షెల్‌కాల్, విటమిన్ బీ కాంప్లెక్స్, విటమిన్ సీ సాఫ్ట్‌జెల్స్, యాంటాసిడ్ పాన్-డీ, పారాసిటమాల్ ఐపీ 500 టాబ్లెట్లు, డయాబెటిక్ ఔషధం గ్లిమిపిరైడ్, బీపీ ఔషధం టెల్‌మిసార్టాన్ ఉన్నాయి.

అలాగే హెటిరో తయారు చేసిన సిపోడెమ్ ఎక్స్‌పీ 50 డ్రై సస్పెన్షన్ ఔషధంలో కూడా నాణ్యతా ప్రమాణాలు లోపించినట్లు సీడీఎస్‌సీఓ గుర్తించింది.

## అత్యధికంగా అమ్ముడుపోయే ఔషధాల్లోనూ నాణ్యతా లోపాలు! కేంద్రం తనిఖీల్లో వెల్లడి!



**న్యూఢిల్లీ-నవభూమి:** మార్కెట్లో అత్యధికంగా అమ్ముడుపోయే బీపీ, షుగర్, పారాసిటమాల్ మందుల్లో నాణ్యతా లోపాలు ఉన్నట్టు తాజాగా బయటపడింది. కేంద్ర ఔషధ రంగ నియంత్రణ మండలి ఇటీవల పలు చోట్ల జరిపిన తనిఖీల్లో ఈ లోపాలు వెలుగు చూశాయి. పారాసిటమాల్- 500 ఎమ్‌జీ, పాన్-డీ, కాల్షియం సప్లిమెంట్లు వంటి పలు ఔషధాల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించినట్టు అధికారులు గుర్తించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. ఆ ఫలితాలతో ఓ జాబితా రూపొందించారు. నాణ్యతా ప్రమాణాలు లోపించిన ఔషధాల్లో విటమిన్ బీ కాంప్లెక్స్, విటమిన్ సీ సాఫ్ట్ జెల్స్, షెల్‌కాల్ (విటమిన్ సీ, డీ3), డయాబెటిక్ ఔషధం గ్లిమిపిరైడ్, బీపీ ఔషధం టెల్మిసార్టాన్ కూడా ఉన్నాయి. మొత్తం 53 ఔషధాల్లో నాణ్యత లోపం కనిపించినట్టు తేలింది. నాణ్యతా లోపాలు ఉన్న ఈ ఔషధాలను ఆల్కెమ్ లేబొరేటరీస్, హిందుస్థాన్ యాంటీబయాటిక్స్, హెటిరో డ్రగ్స్, కర్నాటక యాంటీబయాటిక్స్ అండ్ ఫార్మాసిటుకల్స్ లిమిటెడ్, ప్యూర్ అండ్ క్యూర్ హెల్త్‌కేర్, మెగ్ లైఫ్‌సైన్సెస్ వంటి ప్రముఖ సంస్థలు కూడా ఉన్నట్టు కేంద్ర ఔషధ రంగ నియంత్రణ మండలి పేర్కొంది. ఈ ఔషధాల్లోనూ నాణ్యతా లోపాలు కూడా బయటపడటంతో మరింత అప్రమత్త, తనిఖీలు అవసరమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఔషధ రంగ నియంత్రణ సంస్థ పేర్కొన్న వివరాల ప్రకారం, మెట్రోనిడాజోల్‌ను ప్రభుత్వం రంగ సంస్థ హిందుస్థాన్ యాంటీబయాటిక్ లిమిటెడ్ తయారు చేసింది. షెల్‌కాల్‌ను ప్యూర్ అండ్ క్యూర్ హెల్త్‌కేర్ సంస్థ సిద్ధం చేసింది. ఆల్కెమ్ సంస్థ రూపొందించిన క్లావామ్, పాన్ డీల్లో లోపాలు ఎక్కువగా ఉన్నట్టు కూడా పరీక్షల్లో వెల్లడైంది. తీవ్ర ఇన్ఫెక్షన్ల బారిన పడ్డ చిన్నారులకు ఇచ్చే సీపోడెమ్ ఎక్స్‌పీ 50 డ్రై సస్పెన్షన్ లో లోపాలు ఉన్నట్టు తేలింది. ఈ ఔషధాన్ని హెటిరో సంస్థ ఉత్పత్తి చేస్తోంది. కర్నాటక యాంటీబయాటిక్స్ ఉత్పత్తి చేసిన పారాసిటమాల్‌లో కూడా క్వాలిటీ సంబంధిత సమస్యలు ఉన్నట్టు బయటపడింది.

## ముంబైలో కుంభవృష్టి.. స్తంభించిపోయిన మహా నగరం

**న్యూఢిల్లీ- నవభూమి:** దేశ ఆర్థిక రాజధాని, మహా నగరం ముంబైలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వానలు నగరాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో ఎక్కడ చూసినా ట్రాఫిక్ జామ్‌లే కనిపిస్తున్నాయి. ముంబైలోని పలు శివారు ప్రాంతాలలో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురుస్తోంది. ములుంద్, దాని పరిసరాల్లో భారీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. అంధేరిలో ఓ మహిళ మ్యాన్‌హోల్‌లో పడి మృతి చెందింది. సెర్చ్ ఆపరేషన్‌లో ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. భారీ వర్షాల ప్రభావంతో బుధవారం రాత్రి పలు విమానాలను కూడా దారి మళ్లించాల్సి వచ్చింది. ముంబై విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి ముంబై బయలుదేరిన ఓ విమానాన్ని తిరిగి వెనక్కి పంపారు. ఢిల్లీ నుంచి ముంబైకి వెళ్లాల్సిన మరో విమానాన్ని కూడా హైదరాబాద్‌కు మళ్లించారు. విమానయాన సంస్థలు స్పైస్‌జెట్, ఇండిగో, విస్తారా పలు విమానాలను దారి మళ్లించినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రయాణీకులకు వెల్లడించాయి.

## కంగన కారుకూతలతో బీజేపీకి నష్టం

**న్యూఢిల్లీ-నవభూమి:** మండి ఎంపీ కంగనారనౌత్ కారుకూతలతో బీజేపీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జయధీర్ షెర్గిల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆమె నిరాధారమైన.. అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "సిక్కు సామాజికవర్గం, పంజాబ్ రైతులపై ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా తర్కవిరుద్ధం. పంజాబ్ అభివృద్ధికి ప్రధాని మోదీ చేస్తున్న కృషికి కంగన తీరు విఘాతం కలిగిస్తోంది" అని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఆయన ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కంగన తీరును తీవ్రస్థాయిలో ఎండగట్టారు. సాగు చట్టాలను తిరిగి తీసుకురావాలని కంగన చెప్పడాన్ని తప్పుబట్టారు. "కంగన కారుకూతలతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదు. ఆమె వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యం" అని దుయ్యబట్టారు. సొంత పార్టీ బీజేపీ నుంచి కూడా వ్యతిరేకత వస్తుండడంతో కంగన నష్టనివారణ చర్యలను ప్రారంభించారు. "నా వ్యాఖ్యలపై భేషరతుగా క్షమాపణ చెబుతున్నాను. ఇకపై నేను పార్టీ అభిప్రాయాల మేరకు మాట్లాడతాను" అంటూ ఓ ప్రకటనను విడుదల చేశారు. బీజేపీ మరో అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా కూడా.. "కంగన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం. సాగు చట్టాలపై ఆమె మాటలు బీజేపీ విధానాన్ని ప్రతిబింబించబోవు" అని వ్యాఖ్యానించారు. కాగా, కంగన వ్యాఖ్యలపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా స్పందించారు. "750 మంది రైతులు చనిపోయిన తర్వాత కూడా రైతు వ్యతిరేక బీజేపీ, మోదీ ప్రభుత్వంలో మార్పు రాలేదు" అన్నారు. హరియాణాతోపాటు.. ఇతర రాష్ట్రాల్లో త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ప్రధాని మోదీ కూడా పార్లమెంట్ సాక్షిగా రైతులను ఆందోళనజీవులు, పరాన్నజీవులు అన్న విషయాన్ని గుర్తుచేశారు.

# పాక్ పరిస్థితి ఎంత దారుణం



**పాకిస్తాన్-నవభూమి:** పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి సుమారు గత రెండేళ్లుగా అత్యంత దయణీయంగా ఉందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. అక్కడ కోడి గుడ్డు ధరల నుంచి ఇంధనం ధరల వరకూ పరిస్థితి దారుణంగా ఉందని అంటున్నారు. డాలర్ తో పోలిస్తే పాక్ రూపీ మారకం విలువ దారుణంగా పతనం అయిపోవడంతో ఆ దేశ ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని అంటున్నారు. ప్రధానంగా గత కొంతకాలంగా నిత్యావసర సరుకుల ధరలు పతాక స్థాయికి చేరడానికి తోడు.. ఇటీవల వచ్చిన వరదలతో గోదుమ పంట తీవ్రంగా పోయిందని చెబుతున్నారు. ఇది మూలిగే నక్క మీద తాటికాయ చందంలా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇతర ఇస్లామిక్ దేశాలకు పాక్ నుంచి సరికొత్త సమస్య వచ్చిందని అంటున్నారు. అదే.. బిచ్చగాళ్ల బెడద! అవును... ప్రస్తుతం పాకిస్థాన్ లో బ్రతకటం అత్యంత క్లిష్టతరంగ మారిపోయిందని.. ఇరవై ముప్పై రూపాయలు పెడితే కానీ ఓ గుడ్డు దొరకడం లేదని చెబుతున్నారు. ఈ సమయంలో ముస్లిం మత పవిత్ర ప్రదేశాలను దర్శించడానికి అనే సాకుతో పాకిస్థాన్ నుంచి చాలా మంది ఇస్లామిక్ దేశాలకు వెళ్లిపోతున్నారంట. ఇలా వెళ్లినవారు చాలా మంది భిక్షాటన మొదలుపెట్టారని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పాకిస్థాన్‌లో సాధారణ పౌరులుగా జీవించడం కంటే.. ఈ దేశాల్లో బిక్షగాళ్లుగా జీవించడమే బెటరనే ఆలోచనకు వారంతా వచ్చేశారని అంటున్నారు. పరిస్థితి మరీ ముదిరిపోతుండటంతో.. ఇటీవల పాక్ దౌత్యవేత్తలకు ఇతర ఇస్లామిక్ దేశాల నుంచి ఈ విషయంలో పలు హెచ్చరికలు అందాయని అంటున్నారు. ఇందులో భాగంగా... బిచ్చగాళ్లను కంట్రోల్ చేయండి అంటు పాకిస్థాన్ కు ఇటీవల సౌదీ అరేబియా గట్టిగానే హెచ్చరికలు జారీ చేసిందని అంటున్నారు. మక్కా యాత్ర పేరు చెప్పి వీసాలకు అప్లై చేసుకుని.. పాక్ నుంచి వచ్చి తిరిగి వెళ్లకుండా ఇక్కడే బెగ్గింగ్ చేసుకుంటున్నారని వెల్లడించినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి బిచ్చగాళ్లను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. వారిలో సుమారు 90% మంది పాకిస్థానీయులే అని తేలిందని అంటున్నారు. వీరంతా హజ్ యాత్ర పేరు చెప్పి సౌదీ చేరుకున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ) కూడా వీరి భారిన పడినట్లు చెబుతున్నారు. వీరిలో కొంతమంది ఇరాన్ వరకూ కూడా వెళ్తున్నారని అంటున్నారు. ఏది ఏమైనా.. పక్క దేశాలకు ఉగ్రవాదులను ఎగుమతి చేస్తుందనే పేరున్న పాకిస్థాన్ తాజాగా బిచ్చగాళ్లను కూడా విదేశాలకు పంపిస్తుందనే కామెంట్లు ఈ నేపథ్యంలో వినిపిస్తున్నాయి. మరి పాక్ వారిని కంట్రోల్ చేస్తుందా.. ఇతర ఇస్లామిక్ దేశాల ఆగ్రహాన్ని చవి చూస్తుందా అనేది వేచి చూడాలి.

## మద్యం తాగి మహానాడుకు రావొద్దు..



**న్యూఢిల్లీ-నవభూమి:** విల్లుపురం జిల్లా విక్రవాండిలో అక్టోబరు 27న నిర్వహించనున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడును విజయవంతం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి మహానాడులో పాల్గొనరాదని ఆ పార్టీ వ్యవస్థాపకుడు, సినీ నటుడు విజయ్( సూచించారు. టీవీకే మొట్టమొదటి రాష్ట్రస్థాయి మహానాడు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించిన పార్టీ అధిష్ఠానం అందుకోసం విల్లుపురం జిల్లా చెన్నై-తిరుచ్చిజాతీయ రహదారిలో విక్రవాండి నియోజకవర్గ పరిధిలో సుమారు 85 ఎకరాల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. పోలీసులు 33 నిబంధనలతో మహానాడు నిర్వహణకు అనుమతించిన నేపథ్యంలో, బుధవారం పార్టీ కార్యకర్తలకు కట్టుబాట్లు విధించినట్లు విజయ్ పేర్కొన్నారు.

## షాకింగ్ న్యూస్: జూదం ఆడుతున్న మహిళల పట్టివేత.. ఎక్కడో తెలుసా..?



**న్యూఢిల్లీ- నవభూమి:** తేధునిక ప్రపంచంలో పురుషులతో పాటు మహిళలు అన్నిరంగాల్లోనూ దూసుకెళ్తున్నారు. మగవాళ్లకు దీటుగా ముందుకు సాగుతున్నారు. ఎందు లోనూ తగ్గేదేలే అని అంటున్నారు. అయితే.. నిజామాబాద్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన యావత్ ఆ జిల్లానే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. జూదం అనేది ఓ వ్యసనం లాంటిది. పూర్వం రాజుల కాలం నుంచి ఈ ఆటను ఆడుతున్నారు. అయితే.. జూదానికి అలవాటు పడి చాలా కుటుంబాలు నాశనం అయ్యాయి. చాలా మంది తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. భార్యల మెడలోని పుస్తెలనూ అమ్ముకున్నారు. భూములు, ఇళ్లను సైతం కోల్పోయారు. చివరకు ప్రాణాలు సైతం తీసుకున్న వారు ఉన్నారు. ఇంకొందరు పోలీసులకు పట్టుబడి జైలు జీవితం గడిపిన వారూ ఉన్నారు. మన దేశంలో పేకాటను సరదాగా మాత్రమే ఆడుకోవచ్చు. ఎలాంటి బెట్టింగులు, డబ్బులు పెట్టరాదు. అది చట్టవిరుద్ధం కూడా. బెట్టింగ్‌తో ఆడితే అది నేరమే అవుతుంది. అయితే.. ఇప్పటివరకు పేకాట అంటే పురుషులు మాత్రమే ఆడుతారని అనుకున్నాం. ఒకవేళ మహిళలు అయితే ఇంటి వరకే ఇంట్లోనే ఆడుతుంటారని భావిస్తాం. కొన్నిచోట్ల బడా మహిళలు మాత్రం క్లబ్బుల్లోనో.. ఇతరత్రా చోట్ల ఆడుతుంటారు. కిట్టి పార్టీల పేరిట కూడా ఒకదగ్గర పోగై జూదం ఆడడం అలవాటు. కానీ.. నిజామాబాద్ జిల్లాలో నలుగురు మహిళలు పేకాట ఆడుతూ పోలీసులకు దొరికిపోయారు. దీంతో అంతా షాక్‌కు గురయ్యారు. అయితే.. పోలీసులకు పట్టుబడ్డ వీరంతా ప్రముఖ వైద్యుల భార్యలని తెలిసింది. దీనికి సంబంధించిన వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్ అయింది. నిజామాబాద్ నగరంలోని సరస్వతీనగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రి నాల్గవ అంతస్తును వీరు అడ్డాగా మార్చుకున్నారు. పక్కా సమాచారం మేరకు వన్ టౌన్ పోలీసులు అక్కడికి వెళ్లిచూడగా పేకాట ఆడుతూ చిక్కారు. పేకాట ఆడుతున్న మహిళల నుంచి 5 సెల్‌ఫోన్లు, రూ.15,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు కూడా నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## భారత్‌లో ఏ భాగాన్నీ పాకిస్థాన్ అనడానికి వీల్లేదు

**న్యూఢిల్లీ- నవభూమి:** భారతదేశంలోని ఏ భాగాన్నీ పాకిస్థాన్ అని అనకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. అలా సంబోధించడం దేశ ప్రాదేశిక సమగ్రతకే విరుద్ధమన్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీశానంద ఓపెన్ కోర్టులో చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్ ఇటీవల కలకలం రేపాయి. ఒక వీడియోలో ఆయన బెంగళూరులో ముస్లిం ప్రాబల్య ప్రాంతాన్ని 'పాకిస్థాన్' అని వ్యాఖ్యానించారు. రెండో క్లిప్పింగ్‌లో.. ప్రత్యర్థి న్యాయవాదిని అడిగిన ప్రశ్నకు ఓ మహిళా లాయర్ జవాబు చెప్పినందుకు ఆమెను ఆయన మందలించారు. ఈ క్లిప్పింగులు వైరల్ కావడంతో సుప్రీంకోర్టు ఈ నెల 20న సుమోటో కేసుగా స్వీకరించింది. హైకోర్టు రిజిస్ట్రార్‌ను నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసుపై చీఫ్ జస్టిసతో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం బుధవారం మళ్లీ విచారించింది. జస్టిస్ వి.శ్రీశానంద వ్యాఖ్యలపై సీజేఐ అభ్యంతరం తెలిపారు. తన వ్యాఖ్యలపై సదరు న్యాయమూర్తి ఇప్పటికే విచారం వ్యక్తంచేయడంతో సుమోటో విచారణను కొనసాగించరాదని ధర్మాసనం నిర్ణయించింది. అయితే సీజేఐ ఈ సందర్భంగా న్యాయమూర్తులకు కీలక సూచనలు చేశారు.

## పాక్ ప్రియురాలి కోసం బోర్డర్ దాటబోయాడు.. నెక్స్ట్ జరిగిందిదే!



**న్యూఢిల్లీ- నవభూమి:** ఆన్‌లైన్‌లో పరిచయం అయిన ప్రియుడు / ప్రియురాలి కోసం దేశ సరిహద్దులు దాటేస్తున్న వారి వ్యవహారాలు ఇటీవల మీడియాలో హల్ చల్ చేసిన సంగతి తెలిసిందే. ప్రేమించిన వాడి కోసం భర్తను వదిలి పిల్లలను వెంటపెట్టుకుని పాక్ నుంచి భారత్ వయా దుబాయ్ వచ్చిన వారి కథ ఆ మధ్య సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో భారత్‌లో ఉన్న భర్తను, పిల్లలను, కుటుంబాన్ని వదిలి ఆన్ లైన్ లో పరిచయం అయిన ప్రియుడి కోసం పాక్ కు వెళ్లి, మతం మార్చుకున్న మహిళ వ్యవహారం కూడా తీవ్ర చర్చనీయాంశం అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఓ యువకుడు ఆన్ లైన్‌లో పరిచయమైన ప్రియురాలి కోసం బోర్డర్ దాటాలని ప్రయత్నించాడు. అవును... పాకిస్థాన్‌లోని తన ప్రియురాలిని కలుసుకునేందుకు అక్రమంగా బోర్డర్ దాటేందుకు ప్రయత్నించాడు ఓ యువకుడు. దీంతో... అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాలను కచ్ (వెస్ట్) ఎస్పీ సాగర్ బాగ్మార్ వెల్లడించారు. ఈ సందర్భంగా అతడి మానసిక పరిస్థితి తెరపైకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... జమ్మూకశ్మీర్ కు చెందిన 36 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతడిని ఇంతియాజ్ షేక్ ముల్తాన్‌గా గుర్తించారు. అతను బందిపోరా జిల్లా వాసిగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ పాకిస్థానీ యువతిని కలుసుకునేందుకు అతడు గుజరాత్‌లోని కచ్ జిల్లా ఖవ్రా గ్రామానికి చేరుకున్నాడు. అక్కడ నుంచి పాక్ వెళ్లేందుకు స్థానికుల నుంచి సహకారం కోరాడు. ఈ వ్యవహారం గురించి స్పందించిన కచ్ ఎస్పీ... ఆన్ లైన్‌లో పరిచయమైన యువతిని కలుసుకునేందుకు సరిహద్దు దాటి పాక్ వెళ్లాలని ఇతడు ప్రయత్నించాడని.. అయితే అతనితో ఎటువంటి ముప్పు లేదని నిర్ధరించుకున్నాక విడుదల చేసినట్లు తెలిపారు! ఈ సందర్భంగా ఆ యువకుడి మానసిక పరిస్థితి బాగా లేదని.. అతడు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడని.. పాకిస్థాన్ లోని ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌కు ఆకర్షితుడయ్యాడని అంటున్నారు. గూగుల్ మ్యాప్స్ చూసి కచ్ నుంచి పాక్ వెళ్లాలని ప్రయత్నించాడని తెలిపారు.

## చర్చల దిశగా ఇజ్రాయెల్-లెబనాన్

**న్యూఢిల్లీ- నవభూమి:** టెల్ అవీవ్/బీరుట్, సెప్టెంబరు 25: ఇజ్రాయెల్-హిజ్బుల్లా మధ్య పోరు చినికిచినికి గాలివానగా మారక ముందే చర్చల దిశలో ముందడుగు పడింది. ఇటీవలి ఐక్యరాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ చేసిన చర్చలతో కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బుధవారం పచ్చజెండా ఊపారు. అయితే ఇజ్రాయెల్-హమాస్ చర్చల్లో ఈజిప్ట్ వంటి దేశాలు మధ్యవర్తిత్వం నెరిపిన విషయం తెలిసిందే..! ఇజ్రాయెల్-హిజ్బుల్లా విషయంలోనూ లెబనాన్ ప్రత్యక్షంగా మధ్యవర్తిత్వం నెరపాలని అమెరికా, ఐరోపా దేశాలు కోరుతున్నాయి. ఈమేరకు రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఈ చర్చలకు సంబంధించి, ఆరు ప్రధానవర్గాలను ఉటంకించింది.

## ఆన్ లైన్ లోన్ యాప్సే కాదు..

**న్యూఢిల్లీ- నవభూమి:** గేమింగ్ యాప్స్ ద్వారా డ్రాగన్ చైనా పెద్ద కుట్ర పన్నింది. భారత దేశం నుంచి రూ.400 కోట్ల నగదును గేమింగ్ యాప్ %ఖీ×జుఔ×చీ%తో స్వాధీనం చేసుకుంది. చైనా బండారాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బయటపెట్టింది. రూ.400 కోట్లలో రూ.25 కోట్లను రికవరీ చేసింది.

గేమింగ్ యాప్‌కు సంబంధించి నలుగురు భారతీయులను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చైనా మూలాలు ఉన్న పౌరులు భారతదేశం నుంచి పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించారని అధికారులు గుర్తించారు. ముగ్గురు చైనా పౌరులకు చెందిన క్రిప్టో ఖాతాలను స్వాధీనం చేసుకుంది. గేమింగ్ యాప్ ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థను బలహీనం చేసేందుకు కుట్ర పన్నిందని అధికారులు వివరించారు.

**దాడులతో వెలుగులోకి..**

గేమింగ్ యాప్‌నకు వ్యతిరేకంగా దేశంలో పలు ప్రాంతాల్లో ఈడీ దాడులు చేసింది. ఆ సమయంలో కొందరు భారతీయులను అదుపులోకి తీస్నీకుంది. ఫీవిన్ యాప్ ఆధారిత ఆన్ లైన్ బెట్టింగ్, గేమర్ల నుంచి సేకరించిన డబ్బును కొందరి బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. అందుకు ప్రతీగా యాప్ యజమానులు రీఛార్జ్ చేయడానికి కమీషన్ ఇచ్చేవారు. ఒడిశా రూర్కెలాకు చెందిన అరుణ్ సాహు, అలోక్ సాహు రీఛార్జ్ చేసే వ్యక్తులుగా పనిచేశారని ఈడీ అధికారులు వెల్లడించారు.

**క్రిప్టో కరెన్సీగా మార్పు..**

ఫీవిన్ యాప్ ద్వారా బ్యాంక్ ఖాతాల్లో వచ్చిన డబ్బు క్రిప్టో కరెన్సీగా మార్చారు. ఫీవిన్ యాప్ నుంచి సంపాదించిన క్రిప్టో కరెన్సీని చైనీస్ వ్యక్తుల వాలెట్లలో విదేశీ క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లో జమ చేశారని ఈడీ అధికారులు వివరించారు.

## వెల్‌కమ్ టు వాషింగ్టన్.. న్యూయార్క్‌లో మరోసారి తడబడ్డ జో బైడెన్..!



**అమెరికా - నవభూమి:** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాటల తడబాటు కొనసాగుతూనే ఉంది..! ఇప్పటికే పలు సందర్భాల్లో అంతర్జాతీయ వేదికలపై మతిమరుపు, తడబాట్లతో తీవ్ర విమర్శలపాలైన బైడెన్.. తాజాగా మరోసారి అదేపొరపాటు చేసి మీడియాకు చిక్కారు. ఇటీవలే న్యూయార్క్‌లోని బార్‌క్లే హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ప్రపంచ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో.. బైడెన్ తడబడ్డారు. స్టేజ్‌పైకి బైడెన్ వెళ్తుండగా.. అంతా చప్పట్లు కొట్టారు. దీంతో ముందుగా అందరికీ ధన్యవాదాలు తెలిపిన బైడెన్.. ఆ తర్వాత 'వెల్‌కమ్ టు వాషింగ్టన్' అంటూ ప్రసంగం మొదలు పెట్టారు. ఏ రాష్ట్రంలో ఉన్నామన్నది కూడా గుర్తు లేకుండా న్యూయార్క్ కు బదులు 'వాషింగ్టన్' అని సంబోధించారు. ఆ తర్వాత ఒక్క క్షణం ఆగిపోగిపోయిన బైడెన్.. తన ప్రసంగాన్ని కొనసాగించారు. అధ్యక్షుడి తీరుతో అక్కడివారు ఒక్కసారిగా స్టన్ అయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. మతిమరుపు, పొరపాట్లతో అధ్యక్షుడు బైడెన్ ఇటీవలే నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలిచిన విషయం తెలిసిందే. అంతేకాదు ఒకరిపేరు పలకడానికి బదులు మరొకరి పేరు పలకడం, పలు సందర్భాల్లో ఆయన ఎటూ కదలకుండా చలనం లేని రీతిలో నిలుచుండిపోవడం వంటివి జరిగాయి. దీంతో బైడెన్ ఆరోగ్యంపై రకరకాల ఊహాగానాలు వినిపించాయి. 83 ఏళ్ల బైడెన్ వయసు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అధ్యక్షుడికి పార్కిన్సన్ ఉన్నట్లు ప్రచారం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై వైట్‌హౌస్‌లో అధ్యక్షుడి వైద్యుడు డాక్టర్ కెవిన్ స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం అధ్యక్షుడి ఆరోగ్యం అద్భుతంగా ఉందని తెలిపారు. 'అధ్యక్షుడి హెల్త్ అద్భుతంగా ఉంది. ఆయన మెదడు బాగా పనిచేస్తోంది. అంతా అనుకుంటున్నట్లు ఆయనకు పార్కిన్సన్‌కు సంబంధించిన ఎటువంటి సమస్యా లేదు' అని స్పష్టం చేశారు. ఆయన పదవీ కాలం ముగిసేనాటికి ఏమైనా మార్పులు ఉంటాయా అని విలేకరు ప్రశ్నించగా.. 'పదవీకాలం ముగిసేనాటికి అధ్యక్షుడి ఆరోగ్యంలో గణనీయమైన మార్పులు ఏమీ ఉండకపోవచ్చు' అని తెలిపారు. ఈ క్రమంలోనే మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి సిద్ధమైన బైడెన్‌పై పెద్ద ఎత్తున వ్యతిరేకత కూడా వచ్చింది. దీంతో అధ్యక్ష ఎన్నికల నుంచి వైదొలగుతున్నట్లు బైడెన్ ప్రకటించారు. ఇక ఆయన స్థానంలో ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ పోటీకి దిగారు. ఆమెకు డెమోక్రట్ల నుంచి పూర్తిస్థాయిలో మద్దతు కూడా లభిస్తోంది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. రిపబ్లికన్ పార్టీ తరఫున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కమలా హారిస్ తలపడబోతున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in


## గెలిచే ముందొకటి.. గెలిచిన తర్వాత ఇంకోటి.. పవన్ కల్యాణ్‌పై ప్రకాశ్‌రాజ్ ఫైర్



తిరుమల లడ్డూ వివాదం వ్యవహారంలో సినీ నటుడు ప్రకాశ్ రాజ్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య డైలాగ్ వార్ హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. మీరు ఉపముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో జరిగిన ఘటన ఇది. మీరెందుకు ఈ విషయాన్ని జాతీయ స్థాయిలో చర్చించుకునేలా చేస్తున్నారు. దీనిపై విచారించి నేరస్తులపై చర్యలు తీసుకోండని ప్రకాశ్ రాజ్ ట్వీట్ చేయగా.. ఈ వ్యవహారంతో ప్రకాశ్ రాజ్‌కు సంబంధమేంటని మరోవైపు ఇప్పటికే పవన్ కల్యాణ్ ఫైర్ అయ్యారు.పవన్ కల్యాణ్ కామెంట్స్‌పై ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ.. తాను విదేశాల్లో షూటింగ్ ఉన్నా. పవన్ కల్యాణ్‌కు వీలైతే తన ట్వీట్‌ను మళ్లీ చదివి.. దయచేసి అర్థం చేసుకోవాలని కోరాడు. ఈ నెల 30న వచ్చి మీ ప్రతీ మాటకు సమాధానం చెబుతానన్నాడు. ఆ తర్వాత కొంచెం గ్యాప్ ఇచ్చి.. చేయని తప్పుకి సారీ చెప్పించుకోవడంలో ఆనందమేంటో.. అంటూ జస్ట్ ఆస్కింగ్ హ్యాష్ ట్యాగ్‌ను కూడా జోడించాడు ప్రకాశ్ రాజ్.తాజాగా మరో ట్వీట్ చేసి హాట్ టాపిక్‌గా నిలుస్తున్నాడు ప్రకాశ్‌రాజ్. గెలిచే ముందు ఒక అవతారం.. గెలిచిన తర్వాత ఇంకో అవతారం.. ఏంటీ అవాంతరం.. ఎందుకు మనకీ అయోమయం.. ఏది నిజం..? జస్ట్ ఆస్కింగ్..? అంటూ మరో ట్వీట్ చేశాడు. తాజా కామెంట్స్ కూడా పవన్ కల్యాణ్‌నుద్దేశించి అంటున్నట్టు అర్థమవుతుండగా.. మరి దీనిపై పవన్ కల్యాణ్ ఎలా స్పందిస్తారనేది చూడాలి.





## మరపురాని మధుర ఘట్టం.. జీవితంలోని విలువైన క్షణాలవి: శోభితా ధూళిపాళ్ల

సినీ తారలు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల గత నెలలో నిశ్చితార్థం జరుపుకున్న విషయం తెలిసిందే. ఇరు కుటుంబాలకు చెందిన సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షం లో హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో నిరాడంబరంగా వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ జరిగింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన నిశ్చితార్థ వేడుక గురించి శోభితా ధూళిపాళ్ల ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఆ వేడుకను ఘనంగా నిర్వహించామని తెలిపింది. ఆమె మాట్లాడుతూ..

'ప్రతి ఒక్కరికి నిశ్చితార్థ వేడుకు చాలా ప్రత్యేకమైనది. జీవితంలోని విలువైన క్షణాలవి. మన తెలుగు సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుక చేసుకోవాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. నా కుటుంబం తెలుగు సంస్కృతికి ఎంతో విలువనిస్తుంది. వారి కోరిక మేరకు నా శ్రేయోభిలాషుల సమక్షంలో ఎంతో సంప్రదాయబద్ధంగా వేడుక జరగడం సంతోషాన్నిచ్చింది. ఇక ఎంగేజ్‌మెంట్ గురించి ముందస్తుగా ఎలాంటి ప్రణాళికలు వేసుకోలేదు. జీవితంలోని మధుర క్షణాలను ఆస్వాదించాలనే ఆలోచనలతో నా మనసు నిండిపోయింది. కొద్ది మందిని మాత్రమే ఆహ్వానించినా నా దృష్టిలో ఆ వేడుక ఘనంగా జరిగిందనుకుంటున్నా' అని చెప్పుకొచ్చింది. గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్న చై-శోభితా ధూళిపాళ్ల త్వరలో పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమవుతున్నారు.

## ట్రెండీ డ్రెస్‌లో సామ్..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంతకు ఎలాంటి క్రేజ్, ఫ్యాన్ బేస్, ఫాలోయింగ్ ఉందో అందరికీ తెలిసిందే. 14 ఏళ్ల సినీ కెరీర్ లో ఎన్నో విజయాలు సాధించింది. మరెన్నో ప్రశంసలు అందుకుంది. అన్నిటి కన్నా.. వేరే లెవెల్ లో పాపులారిటీ దక్కించుకుంది. ప్రభాస్ మినహా టాలీవుడ్ స్టార్ హీరోలందరితో ఆడిపాడింది. ఆమె యాక్ట్ చేసిన చిత్రాలు దాదాపు అన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి హిట్స్ గా నిలిచాయి. చివరగా ఖుషి సినిమాతో సందడి చేసింది సామ్. %నాశ్రీంశీ =ఘు౦% - సుకుమార్ పుట్టిన గడ్డపై %-%పుష్ప-2%-%! యశోద మూవీ టైమ్ లో మయోసైటిస్ బారిన పడ్డ సమంత.. ఆ తర్వాత చికిత్స తీసుకుంది. తన చేతిలో ఉన్న ప్రాజెక్ట్స్ ను కంప్లీట్ చేసి విదేశాలకు వెళ్ళింది. ట్రీట్మెంట్ తో పాటు రెస్ట్ తీసుకుంది. ఆధ్యాత్మిక పర్యటనల్లో మునిగితేలింది. ప్రకృతిని ఆస్వాదిస్తూ గడిపింది. రీసెంట్ గా ఇండియాకు వచ్చింది. హెల్త్ సెట్ అవ్వడంతో మళ్ళీ సినిమాలతో బిజీ అయ్యేందుకు సిద్ధమైంది. తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పై మా ఇంటి బంగారం పేరుతో మూవీ అనౌన్స్ చేసింది.

## 'దేవర' ఫీవర్.. వరల్డ్ వైడ్‌గా ఎన్ని థియేటర్లలో రిలీజ్ అవుతుందంటే.?



మరికొన్ని గంటల్లో టాలీవుడ్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా దేవర ఫీవర్ మొదలవుతున్న విషయం తెలిసిందే. ఆరేండ్ల తర్వాత తమ అభిమాన హీరో సోలోగా వస్తుడటంతో అటు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ సినిమా ఎలా ఉంటుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జనతా గ్యారేజ్ తర్వాత ఎన్టీఆర్ కొరటాల శివ కాంబోలో ఈ సినిమా రానుండటం.. అనిరుధ్ సంగీతం అందిస్తుడ టంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్ అవ్వగా.. హాట్ కేకుల్లా అమ్ముడయిపోయాయి. అయితే ఈ సినిమా ఎన్ని థియేటర్లలో అనే దానికి సంబంధించి ప్రస్తుతం ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా 7000 లకుపైగా విడుదల చేయబోతు న్నట్లు సమాచారం. దీంతో ఆర్ఆర్ఆర్ తర్వాత ఆ రికార్డు అందుకున్న సినిమాగా దేవర నిలవబోతుంది. ఆర్ఆర్ఆర్ సినిమాను ప్రపంచవ్యాప్తంగా 10,200 థియేటర్లలో రిలీజ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తెల్లవారు జామున 1.08 గంటలకు స్పెషల్ షోస్‌ను ఓవర్సీస్‌తో పాటు సమానంగా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు మేకర్స్.

## రెండో రోజు విచారణ.. షూటింగ్ స్పాట్స్‌కు జానీ మాస్టర్.. !



డ్యాన్సర్‌పై లైంగిక దాడి కేసులో కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్టయ్యాడని తెలిసిందే. గోవాలో జానీ మాస్టర్‌ను అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసుల బృందం కోర్టులో హాజరుపరచగా.. రాజేంద్రనగర్ కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. జానీ మాస్టర్‌ను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ నార్సింగి పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. 4 రోజుల పోలీస్ కస్టడీకి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక ఫోక్సో కోర్టు అనుమతించింది.

ఇప్పటికే తొలి రోజు విచారణ జరిపిన పోలీసులు.. రెండో రోజు జానీ మాస్టర్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. కాసేపట్లో జానీ మాస్టర్ రెండో రోజు విచారణ చేయనున్నారు. కేసులో కీలకమైన సాంకేతిక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్న పోలీసులు.. అత్యాచారం చేసిన షూటింగ్ స్పాట్స్‌కు జానీని తీసుకెళ్లనున్నారు. నార్సింగి పోలీసులు లాయర్ సమక్షంలో జానీమాస్టర్‌ను ప్రశ్నించనున్నట్టు సమాచారం.ఈ మేరకు నార్సింగి పీఎస్ నుంచి జానీ మాస్టర్‌ను తరలించిన పోలీసులు గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కేసులో సాంకేతిక ఆధారాలు కీలకంగా మారనున్నట్టు తెలుస్తోంది. ఈ కేసులో జానీ మాస్టర్ భార్యను కూడా విచారించే అవకాశముంది.

## జాన్వీ సరే.. ఎవరీ మరాఠా సుందరి?



నదియా, ఇంద్రజ, పంకజం రోజులు పోయాయ్! ఇప్పుడు కొత్త కొత్త క్యారెక్టర్ నటీమణులు తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. ఇప్పుడు తెలుగు సినిమాకి పరిచయం అవుతున్న మరాఠా సుందరి శృతి.పి. మరాఠే గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో శృతి నటించారు. దేవరలో తారక్ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తుండగా, ఈ సినిమాలో కొడుకు పాత్ర కోసం జాన్వీ కపూర్ ని ఎంపిక చేసుకున్నారు కొరటాల. తండ్రి పాత్ర అయిన కు భార్యగా మరాఠీ నటి శృతిని తీసుకున్నారు. శృతి మరాఠీ గుజరాత్ లో జన్మించి మరాఠా సినీరంగంలో తనదైన ముద్ర వేసారు. అయితే ఇప్పటికే పరిచయం ఉన్న పాపులర్ నటీమణులతో కాకుండా ఒక కొత్త నటీమణిని ఎంపిక చేసుకోవడానికి కారణం ఆ పాత్రలో ఉన్న యూనిక్ నెస్ అని కొరటాల చెబుతున్నారు. 2008లో సనై చోగడే అనే మరాఠా చిత్రంతో నటిగా ఆరంగేట్రం చేసిన శృతి ఆ తర్వాత కన్నడం, హిందీ, తమిళంలోను నటించింది. ఇప్పుడు తెలుగు తెరకు పరిచయం అవుతోంది. అయితే యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాతో పరిచయం అవుతుండడం ఈ భామ అదృష్టం అని చెప్పాలి. ఎన్టీఆర్ ఫ్యాన్స్ సోషల్ మీడియా పేజీల్లో శ్రుతి వేగంగా వైరల్ అయిపోతోంది. తెలుగులో ప్రవేశిస్తున్న జాన్వీ కపూర్‌తో సమానంగా ఈ అమ్మడికి మంచి గుర్తింపు దక్కనుంది. శృతి మరాఠీ అందచందాలు, హావభావాలకు యూత్ ఫిదా అయిపోతుండడం విశేషం. మరాఠా సుందరి ఇన్ స్టా పేజీ శృతి పి మరాఠీ నుంచి చాలా ఫోటోలను ఇప్పుడు అభిమానులు వైరల్ చేస్తున్నారు.

## వినేశ్ ఫొగాట్‌కు షాక్.. నోటీసులిచ్చిన యాంటీ డోపింగ్



**జలనా-నవభూమి:** రాజకీయాల్లో అడుగుపెట్టిన మాజీ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అసెంబ్లీ ఎన్నికల కసరత్తును మొదలెట్టింటి. హర్యానాలోని జులనా నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న రోడ్‌షోలు నిర్వహిస్తూ.. ప్రత్యర్థులపై మాటల తూటాలు పేలుస్తోంది. అయితే.. రాజకీయాల్లో వడివడిగా అడుగులు వేస్తున్న వినేశ్‌కు పెద్ద షాక్ తగిలింది. యాంటీ డోపింగ్ ఏజెన్సీ ఆమెకు నోటీసులు పంపింది. 14 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నాడా వినేశ్‌ను కోరింది. అసలు ఏం జరిగిందంటే..? ఈమధ్యే ముగిసిన పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్లో వినేశ్ ఫొగాట్ అనర్హతకు గురైన విషయం తెలిసిందే. 100 కిలోల అదనపు బరువు కారణంగా ఆమె పసిడి పోరు నుంచి వైదొలగాల్సి వచ్చింది. అయితే.. సెప్టెంబర్‌లో నెలలో నాడా వినేశ్ శాంపిల్స్ తీసుకోవాలని భావించింది. కానీ, తమకు చెప్పిన ప్రాంతంలో వినేశ్ అక్కడ లేదని నాడా ఆరోపిస్తోంది. అందుకనే గురువారం నాడా ఆమెకు నోటీసులు పంపింది. 14 రోజుల లోపు వినేశ్ తమకు వివరణ ఇవ్వాలని నాడా ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.

## బుమ్రాకు విశ్రాంతి.. మూడో స్పిన్నర్‌గా అతడు..?



**న్యూఢిల్లీ-నవభూమి:** టీ20 వరల్డ్ కప్ తర్వాత సొంతగడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయంపై కన్నేసింది భారత జట్టు. చెపాక్ స్టేడియంలో బంగ్లాదేశ్ భరతం పట్టిన టీమిండియా కాన్పూర్ టెస్టు లోనూ విజయ గర్జనకు సిద్ధమవుతోంది. అయితే.. కాన్పూర్‌లో స్పిన్నర్లు కీలకం కానున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అందుకని ఈ మ్యాచ్‌లో మూడో స్పిన్నర్‌గా ఎవరిని ఆడించాలి?, ఏ పేసర్‌ను పక్కన పెట్టేయాలి? అనే విషయమై కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గౌతం గంభీర్‌లు సుదీర్ఘ చర్చలు జరుపుతున్నారు.

ఈ నేపథ్యంలో మాజీ ఆటగాడు, కామెంటేటర్ అయిన సంజయ్ మంజ్రేకర్ తుది జట్టును ఎంపిక చేశాడు. లోకల్ బాయ్ అయిన కుల్దీప్ యాదవ్(తుది జట్టులో ఉండాలని సంజయ్ మంజ్రేకర్ అన్నాడు. 'కాన్పూర్ టెస్టులో జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి.. మూడో స్పిన్నర్‌గా కుల్దీప్‌ను ఆడించాలి. ఇక్కడి నల్ల మట్టి పిచ్‌పై కుల్దీప్ చాలా ప్రభావం చూపిస్తాడు. అందుకని అక్షర్ పటేల్ బదులు అతడినే ఆడించాలి అని' ఆయన అభిప్రాయ పడ్డాడు.

## రిటైర్మెంట్ ప్రకటించిన షకీబ్ అల్ హసన్



**కాన్పూర్-నవభూమి:** బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్(టీ20 క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. తక్షణమే తన నిర్ణయం అమలులోకి వస్తుందన్నారు. ఒకవేళ స్వదేశంలో ఫేర్‌మ్యాచ్ లేకుంటే, అప్పుడు కాన్పూర్‌లో భారత్‌తో జరిగే రెండో టెస్టు మ్యాచ్ తనకు చివరిది అవుతుందని పేర్కొన్నారు. 37 ఏళ్ల షకీబ్ 129 టీ20లు ఆడారు. టీ20 వరల్డ్‌కప్ సమయంలోనే చివరి టీ20 మ్యాచ్ ఆడేశానని, సెలెక్టర్లతో ఈ అంశాన్ని చర్చించానని, 2026 వరల్డ్‌కప్‌ను గమనిస్తే, ఇక జట్టు నుంచి తప్పుకోవడం సబబే అని అర్థమవుతోందన్నారు. షకీబ్ మొత్తం 69 టెస్టులు ఆడాడు. వాటిల్లో 4453 పరుగులు చేశాడు. 242 వికెట్లు కూడా తీశాడు. మీర్పూర్‌లో చివరి టెస్టు ఆడాలన్న కోరికను క్రికెట్ బోర్డుకు చెప్పానని, వాళ్లు అంగీకరించారని, బంగ్లాదేశ్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, ఒకవేళ అలా జరగకుంటే, కాన్పూర్‌లో భారత్‌తో జరిగే టెస్టు తనకు చివరిదని తెలిపారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో షకీబ్ హసన్‌పై మర్డర్ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**